PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 230 | విజయవాడ, సోమవారం 25 మార్చి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 25 March 2024 | Rs

రఘురామకు మొండిచెయ్యి
- టికెట్ రాకుండా చక్రం తిప్పిన వైసిపి
- ఆరు లోక్‌సభ స్థానాలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన
- 18 అసెంబ్లీ స్థానాల్లో జనసేన అభ్యర్థులు ప్రకటన

2



సూపర్ సంజు!
- రాయల్స్ కెప్టెన్ అర్ధ సెంచరీ
- లక్నోపై రాజస్థాన్ గెలుపు
- రాజస్థాన్ 193/4, లక్నో 173/6

6



ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయోత్సవ సంబరాలు

జెఎన్‌యులో..

ఎస్‌ఎఫ్‌ఐ కూటమి విజయభేరి

సెంట్రల్ ప్యానెల్ క్లీన్‌స్వీప్ ● 42 కౌన్సిలర్లలో 30 స్థానాలు కైవసం ● మట్టికరిచిన ఎబివిపి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోనే ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు)లో నిర్వహించిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ కూటమి ఘన విజయం సాధించింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి పోస్టులతో సెంట్రల్ ప్యానెల్‌ను ఎస్‌ఎఫ్‌ఐ క్లీన్‌స్వీప్ చేసింది. బిజెపి అనుబంధ ఎబివిపి మట్టికరిచింది. ఎన్ని కుయుక్తులకు పాల్పడినప్పటికీ ఎబివిపి ఓటమి చెందింది. ఎబివిపిని, దాని మతోన్మాద సిద్ధాంతాన్ని జెఎన్‌యు విద్యార్థులు తిరస్కరించారు. అధికారులతో కుమ్మక్కైన ఎబివిపి విధ్వంసక ప్రయత్నాలను ఎస్‌ఎఫ్‌ఐ కూటమి సమర్థవంతంగా ఎదుర్కొంది. అధ్యక్షుడిగా ఎస్‌ఎఫ్‌ఐ కూటమి అభ్యర్థి ధనుంజయ్ (3,100 ఓట్లు) ఎబివిపి తరపున పోటీ చేసిన ఉమేష్ చంద్ర అజ్మీరా (2,118 ఓట్లు)పై విజయం సాధించారు. బాప్సా తరపున పోటీ చేసిన బిస్వజిత్ మింజికి కేవలం 282 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఎఫ్‌ఐ కూటమి అభ్యర్థి అవిజిత్ ఘోష్ (2,762 ఓట్లు) భారీ మెజార్టీతో ఎబివిపి తరపున పోటీ చేసిన దీపికా శర్మ (1,848 ఓట్లు)పై విజయం సాధించారు. బాప్సా తరపున పోటీ చేసిన మొహమ్మద్ అనాస్‌కు 463 ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవికి ఎఐఎస్‌ఎఫ్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ప్రియాంషి ఆర్యను ఎస్‌ఎఫ్‌ఐ కూటమి బలపర్చింది. ఆమె (3,440 ఓట్లు) అత్యధిక మెజార్టీతో ఎబివిపి అభ్యర్థి అర్జున్ ఆనంద్ (2,412 ఓట్లు)పై గెలుపొందారు. సహాయ కార్యదర్శిగా కూటమి అభ్యర్థి మో సాజిద్ (3,035 ఓట్లు) ఎబివిపి తరపున పోటీ చేసిన గోవింద్ డాంగి (2,591 ఓట్లు)పై ఘన విజయం సాధించారు. 42 మంది కౌన్సిలర్లలో 30 మంది ఎస్‌ఎఫ్‌ఐ కూటమికి చెందినవారే కావడం విశేషం.

బాండ్లు కావవి.. ముడుపులు

బాండ్ల స్కాములో వెలుగు చూసిన మరో కోణం ● అక్రమ రూటులో రూ.3.7 లక్షల కోట్ల ప్రాజెక్టులు, కాంట్రాక్టులు

బాండ్లు కొన్న 41 కంపెనీలూ కేంద్ర ఏజెన్సీల దాడులు ఎదుర్కొన్నవే

ఆ కంపెనీల నుంచి బిజెపికి రూ.2,471 కోట్లు అందాయి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ చరిత్రలోనే అతి పెద్ద స్కాముగా పేరొందిన ఎలక్టోరల్ బాండ్ల డేటా తవ్వే కొద్దీ అవినీతి గుట్టలుగుట్టలుగా బయటకొస్తోంది. ఈ అవినీతి పరంపరలో తాజాగా మరో కోణం వెలుగుచూసింది. బిజెపికి రూ.2,471 కోట్లు బాండ్ల రూపంలో ముడుపులు ముట్ట జెప్పిన 41 కంపెనీలు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయపు పన్ను (ఐటి) వంటి కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల దాడులను ఎదుర్కొన్నవే. ఈ దాడుల తరువాత దాదాపు రూ.1,698 కోట్లు బిజెపికి ఈ కంపెనీలు విరాళంగా ఇచ్చాయి. రాజ్యాంగ విరుద్ధమైన ఎలక్టోరల్ బాండ్ల పథకం కింద, కనీసం 30 షెల్ (డొల్ల) కంపెనీలు రూ.143 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేశాయి.

ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి బిజెపికి విరాళం ఇచ్చిన 33 కంపెనీలు 172 మేజర్ కాంట్రాక్టులు, ప్రభుత్వం నుండి ప్రాజెక్ట్ అనుమతులు పొందాయి. బిజెపికి రూ.1,751 కోట్ల ఎలక్టోరల్ బాండ్ విరాళాలు ఇచ్చినందుకు, వారు మొత్తం రూ.3.7 లక్షల కోట్ల ప్రాజెక్టులు, కాంట్రాక్టులు పొందారు. పోస్ట్‌పెయిడ్ కాంట్రాక్టులు, ప్రాజెక్ట్ అనుమతులలో కేంద్రం లేదా బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు రూ.62,000 కోట్లు ఇచ్చాయి. ఆమోదానికి బదులుగా, మూడు నెలల్లోనే ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పార్టీకి రూ.580 కోట్ల "ముడుపులు" లభించాయి. గత ఏడాది ఆగస్టులో ఐటి శాఖ దాడులు జరిపిన మూడు నెలల్లోనే కల్పతరు గ్రూప్ బిజెపికి రూ.5.5 కోట్లు ఇచ్చింది. 2023 నవంబర్ 12, 2021 డిసెంబర్ 1లో ఐటి, ఈడి దాడులు జరిగిన మూడు నెలల్లో ఫ్యూచర్ గేమింగ్ బిజెపికి రూ.60 కోట్లు ఇచ్చింది. 2022 నవంబర్ 10న ఇడి రైడ్ జరిగిన మూడు నెలల్లో అరబిందో ఫార్మా బిజెపికి రూ. 5 కోట్లు ఇచ్చింది. నిఫ్టీ, సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలు కొనుగోలు చేసిన 81 శాతం ఎలక్టోరల్ బాండ్లు బిజెపికే వెళ్లాయి.

15 నిఫ్టీ లిస్టెడ్ కంపెనీలు రూ.646 కోట్లు, ఎనిమిది సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలు రూ.337 కోట్ల విలువ చేసిన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేశాయి. నిఫ్టీ లిస్టెడ్ కంపెనీలు కొనుగోలు చేసిన రూ.646 కోట్లలో ఒక్క బిజెపికే రూ. 521 కోట్లు (81 శాతం) ముట్టాయి.. సెన్సెక్స్ లిస్టెడ్ కంపెనీలు కొనుగోలు చేసిన రూ.337 కోట్లు బిజెపికే అందాయి. . సెన్సెక్స్‌లోని ఎనిమిది కంపెనీలు భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రా టెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, ఐటిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా ఉన్నాయి.ఈ కంపెనీలన్నీ కూడా నిఫ్టీ జాబితాలో ఉన్నాయి. ఇందులో మరో ఏడు డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, దివీస్ లాబొరేటరీస్, సిప్లా, మిగతా 2లో

27 నుంచి ప్రజాక్షేత్రంలోకి..

- మేమంతా సిద్ధం పేరుతో వైసిపి
- 'ప్రజాగళం'తో టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఎన్నికలను రాష్ట్రంలో అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఎన్నికల్లో ఫలితాలు తారుమారైతే కేంద్రంలో అధికారంలో వున్న బిజెపితో తమ పార్టీలకే ముప్పు వచ్చే ప్రమాదం వుందని, దీంతో వ్యూహాత్మకంగా వైసిపి, టిడిపి ముందుకెళ్తున్నాయి. ఎలాగైనా అధికారాన్ని కాపాడుకునేందుకు వైసిపి, అధికారం చేజిక్కించుకునేందుకు టిడిపి సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఇన్నాళ్లూ తాడేపల్లి క్యాంపు కార్యాలయం దాటి బయటకు రావడం లేదని విమర్శలు ఎదుర్కొన్న వైసిపి అధినేత, సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 21 రోజులపాటు ప్రజల్లో వుండేలా మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్రను చేపట్టనున్నారు. ఈ నెల 27న ఇడుపులపాయలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళి అర్పించి బస్సు యాత్ర మొదలుపెట్టనున్నారు. రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే ఏప్రిల్ 18 వరకూ ఈ బస్సు యాత్ర సాగేలా వైసిపి కార్యాచరణ తయారు చేసుకుంది. ఈ బస్సు యాత్ర ప్రతి జిల్లా గుండా సాగుతుంది. ప్రతి జిల్లాలో రాత్రి బస చేసి పార్టీలో అసంతృప్తులను బుజ్జగించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. అలాగే బస్సు యాత్ర సందర్భంగా భారీ బహిరంగ సభలను నిర్వహించడంతోపాటు రోజూ ఉదయం ఆయా జిల్లాల్లోని వివిధ తరగతులకు చెందిన పెద్దలు, ముఖ్యులతో సమావేశం కానున్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు కూడా ఈ నెల 27 నుంచి ప్రజాగళం పేరుతో జిల్లాల పర్యటనకు వెళ్లనున్నారు. రోజుకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బహిరంగ సభలను నిర్వహించేలా టిడిపి ప్రజాగళం కార్యక్రమాన్ని రూపొందించింది. జనసేన, బిజెపితో పొత్తులో వున్న.. ఆ పార్టీ ఇప్పటికే చాలావరకూ అభ్యర్థులను ప్రకటించింది. రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధరలు, తాగునీటి సమస్య తీవ్రంగా వుంది. ప్రధాన పార్టీలు వాటిపై దృష్టి సారించకుండా ఒకరిపై ఒకరు రాజకీయ విమర్శలు చేసుకునేందుకే పరిమితమవుతుండటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

- నీటి సమస్యల పరిష్కారం కోసం తొలి ఉత్తర్వులు



కేజ్రీవాల్ జారీచేసిన ఉత్తర్వును చూపుతున్న మంత్రి అతిషి

న్యూఢిల్లీ : ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే పరిపాలన ప్రారంభించారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ఎదురవుతున్న నీటి, మురుగు నీటి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని నీటి పారుదల శాఖ మంత్రి అతిషిని ఆదేశిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. జైలు నుంచి క్రేజీవాల్ విడుదల చేసిన తొలి ఉత్తర్వులు ఇవే. శనివారం అర్ధరాత్రి తరువాత ఈ ఆదేశాలు తమకు అందినట్లు ఆదివారం విలేకరుల సమావేశంలో మంత్రి అతిషి తెలిపారు. జైలులో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలపై శ్రద్ధ చూపడం తనకు కన్నీళ్లు తెప్పించిందని ఆమె చెప్పారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి సరఫరాను పటిష్టం చేయాలని, నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు తగినన్ని నీటి ట్యాంకర్లను తరలించాలని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కేజ్రీవాల్ నిర్దేశించారని చెప్పారు. అవసరమైతే లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా సహాయాన్ని కూడా తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని, లెఫ్టినెంట్ గవర్నర్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తారని ఆశిస్తున్నామని మంత్రి అతిషి తెలిపారు.

మాధవరం 'ఆత్మహత్య'లపై విచారణకు ఆదేశించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ డిమాండ్

3

31న ఢిల్లీలో 'ఇండియా' మెగా ర్యాలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ నెల 31న ఇండియా ఫోరం ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో 'మహా ర్యాలీ' నిర్వహించనుంది. ప్రతిపక్షాలపై కేంద్రం దాడులకు వ్యతిరేకంగా, కేజ్రీవాల్‌కు మద్దతుగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో ఇండియా ఫోరంలోని భాగస్వామ్య పార్టీల జాతీయ నేతలంతా పాల్గొంటారు. ఆప్ మంత్రులు గోపాల్ రాయ్, అతిషి, సౌరభ్ భరద్వాజ్, ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ అరవిందర్ సింగ్ లవ్లీ, సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాజీవ్ కున్వార్ వెల్లడించారు. ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ప్రధాని మోడీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన తీరును దేశ వ్యాప్తంగా రాజ్యాంగాన్ని ప్రేమించే, గౌరవించే వారందరూ వ్యతిరేకిస్తున్నారు. ఇది కేవలం కేజ్రీవాల్ గురించి మాత్రమే కాదు. మొత్తం ప్రతిపక్షాన్ని తుడిచిపెట్టడానికి మోడీ కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారు. అమ్ముడు పోవడానికి, తలవంచడానికి సిద్ధంగా లేని వారిపై కేసులు నమోదు చేసి.. మిగతా 2లో

'అనంత'లో ఆకలి చావు!

- కొన్ని నెలలుగా విగ్రహం నీడనే జీవనం
- దయనీయ స్థితిలో గర్భిణి మృతి
- కలెక్టరేట్ ఎదుటే ఘటన



కలెక్టరేట్ ఎదుట ఫెర్రర్ విగ్రహం కింద ఉన్న అంజలి మృతదేహం

ప్రజాశక్తి - అనంతపురం సిటీ

కరువు సీమ అనంతపురంలో ఆకలి చావు సంభవించింది. తిండిలేక గర్భిణి మరణించింది. మద్యానికి బానిసైన భర్త పట్టించుకోకపోవడం, ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. కలెక్టరేట్ ఎదుటే ఆమె కుటుంబం నాలుగేళ్లుగా ఉంటోంది. అయినా, ఏ అధికారికీ ఆ కుటుంబం గురించి పట్టలేదు. స్థానికుల కథనం ప్రకారం... అనంతపురం నగరంలోని టివి టవర్ వద్ద నివసించే ఓ దళిత కుటుంబానికి చెందిన అంజలి (29) తనకు 14 సంవత్సరాల వయసులో బిసి సామాజిక తరగతికి చెందిన రాజు అనే యువకుడిని ప్రేమించింది. మైనార్టీ కూడా తీరని అంజలి పెద్దలను ఎదిరించి రాజును పెళ్లి చేసుకుంది. కొన్ని రోజులు వారి జీవనం సజావుగా సాగింది. వారికి ముగ్గురు సంతానం కలిగారు. రాజు తాగుడుకు బానిసయ్యాడు. భార్య, పిల్లలను పట్టించుకోవడం మానేశాడు. దీంతో, వారి జీవనం కష్టంగా మారింది. ఆ కుటుంబం నివసించడానికి నీడ కూడా కరువైంది. దీంతో, కలెక్టరేట్ ఎదుట చెరువు కట్ట మీదకు వెళ్లే దారిలో ఉండే ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం కింద నాలుగు సంవత్సరాలుగా ఆ కుటుంబం ఉంటోంది. ముగ్గురు పిల్లలను ప్రతి రోజూ దేవాలయాల వద్ద భిక్షాటనకు కూర్చోబెట్టి వచ్చిన డబ్బుతో రాజు మద్యం సేవించేవాడు. కొద్దోగొప్పో మిగిలిన డబ్బుతో ఏదైనా తిండి తెచ్చుకుని తినేవారు. ప్రస్తుతం అంజలి నాలుగు నెలల గర్భిణి. ఆమెకు కనీస పోషకాహారం లేకపోవడంతో బలహీనంగా మారింది. ఈ నేపథ్యంలో అంజలి శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఎదుట రోడ్డు దాటుతున్న సమయంలో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అంజలి కింద పడినా తిరిగి పైకిలేచి నడుచుకుంటూ తాను నివసిస్తున్న విగ్రహం వద్దకు చేరుకుంది. రాత్రి రెండు గంటల సమయంలో తన భర్త రాజును నిద్రలేపి తనకు బాగా ఆకలిగా ఉందని చెప్పింది. అయినా, అతను పట్టించుకోలేదు. ఆకలితో అలమటిస్తూ అంజలి ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో మరణించింది. ఉదయం గమనించిన అక్కడున్న వారు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం మిగతా 2లో

రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి
కేంద్రం రెడ్ సిగ్నల్!

- నిధులివ్వని బిజెపి సర్కార్
- ఏళ్లు గడుస్తున్నా షెడ్డులకే పరిమితం
- పట్టించుకోని రాష్ట్ర పాలకులు



షెడ్డు నిర్మాణానికి పరిమితం అయిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాయలసీమపై చిన్నచూపు చూస్తోంది. ఈ ప్రాంతంలతోని ప్రాజెక్టులను పట్టించుకోవడం లేదు. కర్నూలు పరిధిలో రైల్వే కోచ్‌ల పునరుద్ధరణ ఫ్యాక్టరీ ఏర్పాటుపై తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోంది. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా తలపెట్టిన ఈ ఫ్యాక్టరీకి బిజెపి ప్రభుత్వ పదేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. దీంతో, ఫాక్టరీ పనులు షెడ్‌ల నిర్మాణానికే పరిమితమయ్యాయి. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఉంది. రాష్ట్ర పాలకులు కూడా పట్టించుకోకపోవడంతో ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో, ఉపాధి దొరుకుతుందని ఆశించిన కర్నూలు జిల్లా నిరుద్యోగులకు నిరాశ తప్పడం లేదు. మన రాష్ట్రంలోని కర్నూలు జిల్లా ఇ.తాండ్రపాడు, పంచలింగాలు, తెలంగాణ రాష్ట్రం జోగుళాంబగద్వాల జిల్లా ఆలంపూర్ రోడ్డు పరిధిలో 2013-14 ఆర్థిక సంవత్సరంలో అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే కోచ్ పునరుద్ధరణ ఫ్యాక్టరీని మంజూరు చేసింది. దీని నిర్మాణానికి మిగతా 2లో

కాంగ్రెస్‌లో చేరిన వైసిపి ఎమ్మెల్యే ఎలిజా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గ (ఎస్‌సి) ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఐఆర్ఎస్ అధికారి అయిన ఆయన 2019 ఎన్నికల్లో ఉద్యోగానికి రాజీనామా చేసి వైసిపి తరపున పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం ఎలిజాకు టికెట్ ఇవ్వకుండా కంభం విజయరాజుకు వైసిపి టికెట్ కేటాయించింది. దీంతో, కాంగ్రెస్ తరపున చింతలపూడి నుంచి పోటీ చేసేందుకు ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. మీడియాతో మాట్లాడిన ఆయన వైసిపికి, ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. వైసిపిని వీడటానికి చాలా కారణాలున్నాయని చెప్పారు. తనను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టారని, అవమానపరిచారని తెలిపారు. స్థానికంగా నెలకొన్న కొన్ని రాజకీయ పరిస్థితుల వల్ల అక్కడ ఇమడలేక బయటకు వచ్చేశానని వివరించారు. కులాలు, మతాల ఆధారంగా కాంగ్రెస్ రాజకీయాలు చేయదని అన్నారు.



పట్టుకున్న ఇ - సిగరెట్లను చూపుతున్న జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప

విశాఖలో భారీగా పట్టుబడ్డ ఇ - సిగరెట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖపట్నం పోర్టు టెర్మినల్‌లో 25వేల కిలోల డ్రగ్స్ కంటైనర్ సిబిఐకు పట్టుబడిన కొద్దిరోజుల్లోనే నగరంలో నిషేధిత ఇ-సిగరెట్లు పట్టుబడడం కలకలం రేగింది. ఈ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప కేసు వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు ఇటీవల నగరంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో నిర్వహించిన ఆకస్మిక దాడులలో మూడు ఇ-సిగరెట్లు దొరికాయి. నగరంలోని మీరా కలెక్షన్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఇ-సిగరెట్లు విక్రయిస్తున్న సన్నీ కర్నాని, దస్‌పల్లా హిల్స్ రోడ్డుపై దేజావు రెడీమేడ్ క్లాత్ షాప్ నిర్వహిస్తున్న హబీబ్ ఖాన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 743 ఇ - సిగరెట్లును స్వాధీ నం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ సుమారు రూ.22 లక్షలు ఉంటుంది. బహిరంగ మార్కెట్లో ఒక్కో సిగరెట్‌ను నిందితులు రూ.3 వేలకు విక్రయి స్తున్నారు. ఈ నిషేధిత ఇ-సిగరెట్లలో ప్రాణాంత కమైన మత్తు పదార్థం నికోటిన్ ఉంటుంది. ఇది ఊపిరితిత్తులను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఇ-సిగరెట్లు బ్యాటరీ కలిగి ఉంటాయని, రీ-ఛార్జ్ చేసుకోవొచ్చని జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప తెలిపారు. వీటిని ముంబయికి చెందిన అశోక్ శ్యామ్ కటారా నుంచి కొనుగోలు చేసినట్టు నిందితులు చెప్పినట్టు వెల్లడించారు. సమావేశంలో డిసిపి -1 మణికంఠ చందోలు, త్రీటౌన్ ఎస్ఐ పార్థసారథి పాల్గొన్నారు.

దళితుని హత్యపై కొనసాగుతున్న విచారణ

రిమాండ్‌కు నిందితుల తరలింపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం పాచిగుంట దళితవాడకు చెందిన దళితుడు సుధాకర్‌ను హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరి చేయడంతో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితులు ఇద్దరినీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సుధాకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, విచారణ కొనసాగుతోందని వన్‌టౌన్ సిఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. సుధాకర్ అతిగా మద్యం సేవించి మృతి చెందాడా? హత్య? అనే విషయం పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక తెలుస్తుందన్నారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు. గ్రానైట్ పరిశ్రమ యజమాని నాగరాజు, ఆటో డ్రైవర్ రఘులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

స్వగ్రామంలో సుధాకర్ అంత్యక్రియలు

పోస్టుమార్టం అనంతరం సుధాకర్ మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు. ఆదివారం ఉదయం స్వగ్రామంలో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. సుధాకర్‌కు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ

- వరుస సెలవులతో శ్రీవారి దర్శనానికి 24 గంటలు

ప్రజాశక్తి- తిరుమల

వరుస సెలవు దినాలు కావడంతో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదివారం సందర్శకుల రద్దీ కొనసాగుతోంది. తిరుమలలో టోకెన్లు లేని వారికి శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోందని టిటిడి పేర్కొంది. అన్ని కంపార్టుమెంట్లలో నిండిపోయి ఆళ్వార్ ట్యాంకు అతిథి గృహం వరకు సందర్శకులు వేచి ఉన్నారు. శనివారం 72,986 మంది శ్రీవారిని సందర్శించుకున్నారు. 33,482 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. తిరుమలలో శనివారం రూ.2.97 కోట్లు హుండీ ఆదాయం వచ్చినట్లు టిటిడి అధికారులు తెలిపారు.

ఇండోసోల్‌కు భూముల కేటాయింపుపై సిబిఐ విచారణ జరపాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ఒకరోజు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కంపెనీ అయిన ఇండోసోల్ కంపెనీకి 17,630 ఎకరాల భూమిని కేటాయించడం పట్ల సిబిఐతో విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఇండోసోల్ కంపెనీకి రామయపట్నం పోర్టు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో దాదాపు 25 వేల ఎకరాల భూములను అప్పనంగా కట్టబెట్టారని విమర్శించారు. ఎన్నికల కోడ్ కాలంలో కోట్లాది రూపాయలు విలువ చేసే భూములను బినామీ కంపెనీలకు ధారాదత్తం చేశారని విమర్శించారు. జగన్ అక్రమాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ఆశీస్సులు వున్నాయని అన్నారు.

బాండ్లు కావవి.. ముడుపులు

(మొదటి పేజీ తరువాయి)

గ్రాసిమ్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, యుపిఎల్ లిమిటెడ్ ఉన్నాయి.

ఎలక్టోరల్ బాండ్ల పథకంతో నాలుగు రకాల అవినీతి జరిగిందని, ఎలక్టోరల్ బాండ్ల పథకం స్వతంత్ర దేశంలో అతిపెద్ద స్కామ్‌లలో ఒకటి అని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. "మొదటిది చందా దో, ధందాలో (విరాళం ఇచ్చి వ్యాపారం చేసుకోండి), రెండోది హఫ్తా-వసూలి (దోపిడీ), మూడోది దిలో రిష్వత్ దో (బ్యాగ్ కాంట్రాక్ట్, లంచం ఇవ్వండి)" అని విమర్శించారు.

31న ఢిల్లీలో 'ఇండియా' మెగా ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

జైల్లో వేస్తున్నారు. ఈ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడానికి, విస్తరించడానికి రాంలీలా మైదాన్‌లో ర్యాలీ నిర్వహించనున్నాం. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే వారు రాంలీలా మైదానానికి రావాలని విన్నవిస్తున్నాం'అని అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ర్యాలీ: అతిషి

'మహా ర్యాలీ' కేజ్రీవాల్‌ను రక్షించడానికి కాదు, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి అని ఢిల్లీ మంత్రి అతిషి తెలిపారు. 'దేశంలో ప్రజాస్వామ్యం అపాయంలో ఉంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. నియంతృత్వాన్ని పారదోలాల్సిన సమయం వచ్చింది.వ్యవస్థలను ప్రధాని మోడీ తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు' అని అతిషి మండిపడ్డారు.

రాజకీయాలకు అతీతం : కాంగ్రెస్

ఈ నెల 31న జరిగే మహా ర్యాలీ రాజకీయాలకు అతీతం అని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అరవిందర్ సింగ్ లవ్లీ స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తున్నారని, పార్టీ ఖాతాలను స్తంభింపచేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతు వినిపించడానికి ర్యాలీ చేపడుతున్నామని వివరించారు.. ఈ నెల 31న 'ఇండియా' బ్లాక్‌కు చెందిన మిత్రపక్షాల నేతలు ఏకతాటిపైకి వస్తారని సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాజీవ్ కున్వార్ తెలిపారు. ప్రజాస్వామ్యంపై దాడులను తాము సహించబోమని అన్నారు. దీనిపై పోరాడుతామని పేర్కొన్నారు.

అందరి చూపు 'పిఠాపురం వైపే'

- పవన్‌ను ఓడించేందుకు వైసిపి ప్రణాళికలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల నేతల దృష్టి ఆ నియోజకవర్గంపై పడింది. పిఠాపురం నుంచి భారీ మెజార్టీతో గెలవాలనే లక్ష్యంతో పవన్‌కల్యాణ్ వ్యూహ ప్రతి వ్యూహాలు పన్నుతున్నారు. ఆరు నూరైనా అసెంబ్లీలో అడుగుపెట్టాలనే పట్టుదలతో జనసేన ఉంది. రెండు, మూడు రోజుల్లో పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి వారాహి యాత్రతో ప్రచారం మొదలుపెట్టనున్నారు. ఇదే సందర్భంలో ఎట్టిపరిస్థితుల్లోనూ పవన్‌కల్యాణ్‌ను ఓడించి తీరాలని వైసిపి తమ శక్తియుక్తులను కూడగట్టే పనిలో నిమగ్నమైంది. అందులో భాగంగా అదే సామాజిక తరగతికి చెందిన ఎంపి వంగా గీతను పిఠాపురం నుంచి వైసిపి బరిలో దించింది. ఎన్‌డిఎ కూటమి పొత్తులో భాగంగా పిఠాపురం స్థానం జనసేనకు కేటాయించడం, అందులోనూ ఆ పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ స్వయంగా పోటీ చేస్తుండటంతో ఆ స్థానానికి ప్రాధాన్యత పెరిగింది. ఇద్దరు అభ్యర్థులు ఒకే సామాజిక తరగతికి చెందినవారు కావడంతో పోటీ రసవత్తరంగా మారినట్లేనని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తొలి నుంచి పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్‌విఎస్‌ఎన్ వర్మ పోటీలో ఉంటారని భావించినప్పటికీ పొత్తుల నేపథ్యంలో ఆయన పోటీలో ఉండే అవకాశం లేకపోయింది. టిడిపి శ్రేణులు తీవ్ర నిరసనలు తెలపడంతో స్వయంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పిలిపించుకుని ఎమ్మెల్సీగా ఇస్తామని, తొలివిడతలోనే అంతకంటే ముఖ్యమైన పదవి ఇస్తామని హామీనివ్వడంతో వర్మ మెత్తబడ్డారని సమాచారం. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌తో ఆదివారం కాకినాడ, అమలాపురం, రాజమండ్రి టిడిపి పార్లమెంటు ఇన్‌ఛార్జి సుజయకృష్ణ రంగారావు, పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జి వర్మ భేటీ అయ్యారు. పిఠాపురంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను పవన్‌కల్యాణ్‌కు వివరించారు. అలాగే వైసిపి సిటింగ్ ఎమ్మెల్యే దొరబాబుకు ఆ పార్టీ సీటు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపింది. ఆయన కొంతకాలంగా వైసిపికి అంటీ అంటనట్లుగా వ్యవహరించారు. తాజాగా దొరబాబును సిఎం వైఎస్ జగన్ సిఎంఒకు పిలిపించుకుని మాట్లాడారు. వంగా గీతను గెలిపించుకురావాలని, భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పవన్‌కల్యాణ్‌ను ఓడించేందుకు కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ముద్రగడ పద్మనాభంలకు బాధ్యతలు అప్పజెప్పినట్లు సమాచారం.

18 స్థానాల్లో జనసేన అభ్యర్థుల ప్రకటన

- 3 స్థానాలు పెండింగు

జనసేన పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థుల జాబితాను శనివారం ఆ పార్టీ అధికారికంగా విడుదల చేసింది. పొత్తులో భాగంగా 21 సీట్లు ఆ పార్టీకి కేటాయించగా, అందులో 18 సీట్లలో పోటీ చేసే అభ్యర్థులను వెల్లడించింది. మిగిలిన అవనిగడ్డ, పాలకొండ, విశాఖపట్నం దక్షిణం స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి జనసేన తరపున తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ఖరారైన విషయం తెలిసిందే.

అసెంబ్లీ నియోజకవర్గం	పోటీ చేసే అభ్యర్థి పేరు	అసెంబ్లీ నియోజకవర్గం	పోటీ చేసే అభ్యర్థి పేరు
పిఠాపురం	పవన్‌కల్యాణ్	పి.గన్నవరం	గిడ్డి సత్యనారాయణ
నెల్లిమర్ల	లోకం మాధవి	రాజోలు	దేవ వరప్రసాద్
అనకాపల్లి	కొణతాల రామకృష్ణ	తాడేపల్లిగూడెం	బొలిశెట్టి శ్రీనివాస్
కాకినాడ రూరల్	పంతం నానాజీ	భీమవరం	పులపర్తి ఆంజనేయులు
రాజానగరం	బత్తుల బలరామకృష్ణ	నరసాపురం	బొమ్మిడి నాయకర్
తెనాలి	నాదెండ్ల మనోహర్	ఉంగుటూరు	పత్సమట్ల ధర్మరాజు
నిడదవోలు	కందుల దుర్గేష్	పోలవరం	చిర్రి బాలరాజు
పెందుర్తి	పంచకర్ల రమేష్‌బాబు	తిరుపతి	ఆరణి శ్రీనివాసులు
యలమంచిలి	సుందరపు విజయ్‌కుమార్	రైల్వే కోడూరు	యనమల భాస్కరరావు

రఘురామకు మొండిచెయ్యి

- టికెట్ రాకుండా చక్రం తిప్పిన వైసిపి
- ఆరు లోక్‌సభ స్థానాలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన
- సీట్ల కేటాయింపులో వలసవాదులకు పెద్దపీట

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్‌డిఎ కూటమిలో బిజెపి అభ్యర్థిగా నరసాపురం ఎంపి రఘురామ కృష్ణరాజుకు టికెట్ దక్కుతుందని అందరూ ఊహించినప్పటికీ బిజెపి కేంద్ర నాయకత్వం ఆయనకు ఝలక్ ఇచ్చింది. ఆదివారం ప్రకటించిన ఐదో విడత లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో నరసాపురం సీటు వేరొకరికి కేటాయించింది. గత నాలుగేళ్లుగా సిఎం జగన్‌పై తనదైన శైలిలో రఘురామ విమర్శలు చేశారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో జరిగిన టిడిపి, జనసేన బహిరంగ సభలోనూ నరసాపురం నుంచి తప్పకుండా పోటీ చేస్తానని రఘురామ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లోనూ రఘురామకు టికెట్ దక్కకూడదంటూ వైసిపి అధిష్టానం తనకు అనుకూలమైన బిజెపి నేతలతో కేంద్ర నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి టికెట్ లేకుండా చేయడంలో సక్సెస్ అయిందనే వాదన రాజకీయ వర్గాల్లో వినబడుతోంది. రాష్ట్రానికి సంబంధించి ప్రకటించిన ఆరు లోక్‌సభ స్థానాల్లో ఐదుగురు ఇతర పార్టీల నుంచి బిజెపిలో చేరినవారే కావడం గమనార్హం. దీంతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల నేతలకు టికెట్లు దక్కలేదు. సీట్లు దక్కించుకున్న వారిలో అరకు (ఎస్‌టి) కొత్తపల్లి గీత, అనకాపల్లి నుంచి సిఎం రమేష్, రాజమండ్రి నుంచి దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాసవర్మ, తిరుపతి (ఎస్‌సి) నుంచి గూడూరు వైసిపి ఎమ్మెల్యే వరప్రసాదరావు, రాజంపేట నుంచి మాజీ సిఎం ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

దేశవ్యాప్తంగా 111 మంది పేర్లతో బిజెపి తన ఐదో జాబితాను ప్రకటించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా బాలీవుడ్ నటి కంగనా రనౌత్ పోటీ చేయనున్నారు. ఈ జాబితాలో మేనకా గాంధీ (యుపిలోని సుల్తాన్‌పూర్ నియోజకవర్గం), ఉత్తరప్రదేశ్ మంత్రి జితిన్ ప్రసాద, సీతా సోరెన్ (డుంకా) కూడా చోటు లభించింది.

నేడు అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన!

టిడిపి, జనసేనతో సర్దుబాట్లలో భాగంగా బిజెపి 10 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తోంది. అధికారికంగా ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన సోమవారం వెలువడనుందని బిజెపి వర్గాలు పేర్కొంటున్నాయి. విజయవాడ వెస్ట్ నుంచి కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, కైకలూరు నుంచి మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, జమ్మలమడుగు నుంచి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, ధర్మవరం నుంచి బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ పేర్లు ఖరారైనట్లు సమాచారం. మిగిలిన సీట్లలో అభ్యర్థులు ఎవరనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదు.

చంద్రబాబుతో మంద కృష్ణ మాదిగ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న మంద కృష్ణ మాదిగ తదితరులు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆదివారం ఈ భేటీ జరిగింది. టిడిపితో మాదిగలది శాశ్వత బంధం అని, పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించాలని చంద్రబాబు ఈ సందర్భంగా కోరారు. మాదిగ సామాజిక తరగతిని అధికారంలో భాగస్వాములు చేస్తామని హామీ ఇచ్చారు. దళితులపై వైసిపి ప్రభుత్వ దమనకాండను ఎదుర్కోవడంలో మందకృష్ణ పోరాటం చేస్తున్నారని అన్నారు. అధికారంలోకి రాగానే ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయాలని చంద్రబాబును మందకృష్ణ కోరారు. వైసిపి ప్రభుత్వం ఎస్‌సిలకు రద్దు చేసిన అన్ని పథకాలనూ తిరిగి ప్రారంభించాలన్నారు. ఎన్‌డియేకు తమ మద్దతు ఉంటుందని చెప్పారు.

27 నుంచి ఎన్నికల ప్రచారం

ఈ నెల 27 నుంచి చంద్రబాబు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రజాగళం పేరుతో రోజుకు 3 నుంచి 4 నియోజకవర్గాల్లో కార్యక్రమం జరగనుంది. ఈ నెల 27న చిత్తూరు జిల్లా పలమనేరు, నగరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. 28న రాప్తాడు, సింగనమల, కదిరి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. 29న శ్రీశైలం, నందికొట్కూరు, కర్నూలు, 30న ప్రొద్దుటూరు, సూళ్లూరిపేట, శ్రీకాళహస్తిలో పర్యటించనున్నారు. 31న కావలి, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలులో ప్రచారం నిర్వహించనున్నారు.

మరోసారి లోకేష్ కాన్వాయ్ తనిఖీ

- ఎన్నికల కోడ్ పేరుతో ఒకే రోజు రెండుసార్లు పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి టిడిపి అభ్యర్థి నారా లోకేష్ కాన్వాయ్‌ను పోలీసులు ఆదివారం తాడేపల్లిలో రెండుసార్లు తనిఖీలు చేశారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా తనిఖీలు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాన్వాయ్‌లోని కార్లన్నింటినీ పరిశీలించారు. ఈ సందర్భంగా తాడేపల్లి ఎస్‌ఐ శ్రీనివాసరావుకు, లోకేష్‌కు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రోజుకు రెండుసార్లు తనిఖీ చేస్తారా? అని పోలీసులను లోకేష్ ప్రశ్నించారు. వైసిపి నేతల కార్లను ఎందుకు సోదాలు చేయడంలేదని నిలదీశారు. అధికార పార్టీకి ఒక విధంగా, ప్రతిపక్ష పార్టీకి మరో విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. టిడిపి నేతల వాహనాలు మాత్రమే ఆపాలని రూల్ ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. కాన్వాయ్‌లో ఉన్న వాహనాలను పరిశీలించిన అనంతరం కోడ్‌కు విరుద్ధంగా ఏమీ లేదని నిర్ధారించుకుని పోలీసులు వదిలివేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 5 గంటలకు ఉండవల్లిలోని చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లి వచ్చే సమయంలో తనిఖీలు జరగడం గమనార్హం. అయితే, టిడిపి నాయకులను లక్ష్యంగా చేసుకుని వారి వాహనాలను పోలీసులు పదేపదే తనిఖీలు చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో ఎక్కడికక్కడ అక్రమ నగదు సరఫరాను అధికారులు అడ్డుకుంటున్నారు. సరైన పత్రాలు లేని వాటిని సీజ్ చేస్తున్నారు. శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల్లో ఆదివారం అనధికారికంగా తరలిస్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం రాపాక కూడలి వద్ద ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీలో రూ.1.95 లక్షల నగదు లభ్యమైంది. నరసన్నపేటకు చెందిన ఎల్.నగేష్ అనే చింతపండు వ్యాపారి కారులో రాజాం వెళ్తుండగా... తనిఖీలు చేపట్టారు. కారులో తరలిస్తున్న రూ.1.95 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి జెఎంజె మహిళా కళాశాల వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. కష్ణా జిల్లా నాగాయలంక గ్రామానికి చెందిన తలసిల సత్యనారాయణ తన కారులో తలిస్తున్న లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు.

విజయవాడలో బ్లేడ్ బ్యాచ్ వీరంగం

- పోలీసులు, ఆర్‌టిసి సిబ్బందిపై దాడి
- ఒకరికి గాయాలు
- భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు

ప్రజాశక్తి- విజయవాడ


ఆర్‌టిసి సిబ్బంది, పోలీసులతో గొడవ పడుతున్న బ్లేడ్ బ్యాచ్, యాచకులు

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ పండిట్ నెహ్రూ ఆర్‌టిసి బస్ స్టేషన్లో బ్లేడ్ బ్యాచ్ ఆదివారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో వీరంగం సృష్టించింది. పోలీసులపైనా, ఆర్‌టిసి సిబ్బందిపైనా దాడి చేసింది. దీంతో, ఒకరికి గాయాలయ్యాయి. బ్లేడ్ బ్యాచ్ నుంచి ప్రాణాలు కాపాడుకోవడానికి పోలీసులు, ఆర్‌టిసి సిబ్బంది పరుగులు పెట్టాల్సి వచ్చింది. ప్రయాణికులు కూడా తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కృష్ణలంక పోలీసుల కథనం ప్రకారం... మద్యం తాగిన బ్లేడ్ బ్యాచ్ బస్టాండ్లోని బెంచీలను ఆక్రమించుకుని నిద్రించింది. వీరిలో కొందరు యాచకులు కూడా ఉన్నారు. ప్రయాణికుల ఫిర్యాదుతో వారిని అక్కడి నుంచి పంపించేందుకు పోలీసులు, ఆర్‌టిసి సిబ్బంది చర్యలు చేపట్టారు. బెంచీలపై పడుకున్న వారిని లేపడానికి ప్రయత్నించగా, వారిపై బ్లేడ్ బ్యాచ్ దాడి చేసింది. వందమందికిపైగా ఒక్కసారిగా దూసుకొచ్చి గొడవకు దిగడంతో పోలీసులు, ఆర్‌టిసి సిబ్బంది భయంతో పరుగులు తీశారు. బ్లేడ్ బ్యాచ్ దాడిలో ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సాంబయ్యకు గాయాలయ్యాయి. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్రంగా భయపడ్డారు. అదనపు పోలీసుల రాకతో బ్లేడ్ బ్యాచ్ అక్కడి నుంచి పరారైంది. దాడికి పాల్పడిన వారిలో కొందరిని పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. రైల్వే స్టేషన్లోకి యాచకులను, బ్లేడ్ బ్యాచ్‌ను రానివ్వకపోవడంతో వారంతా బస్టాండుకు వస్తున్నారు. అక్కడి నుంచి వారిని పంపడానికి ప్రయత్నించడంతో వారంతా దాడికి దిగారని సిఐ మురళీకృష్ణ తెలిపారు. బస్ స్టేషన్‌లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు.

'అనంత'లో ఆకలి చావు!

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్న సాయి ట్రస్ట్ అధ్యక్షులు విజయసాయి కుమార్, ట్రస్టు సభ్యులు అక్కడికి వెళ్లారు. పోలీసులకు సమాచారం అందించి తహశీల్దార్ అనుమతితో ప్రత్యేక వాహనంలో జెఎన్‌టియు రోడ్‌లోని వైకుంఠఘాట్‌లో అంజలికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

కనీస సాయం కరువు

ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి ఎటువంటి సంక్షేమ పథకాలూ అందలేదని సమాచారం. కనీసం బియ్యం కార్డు ఉన్నా అంజలి ఆకలి చావుకు గురయ్యేది కాదని స్థానికులు చర్చించుకున్నారు. రాజుకు ఆధార్ కార్డు ఉంది. అంజలికి, ఆమె ముగ్గురు పిల్లలకు ఆధార్ కార్డు కూడా లేదు. తాగుడుకు బానిసైన రాజు ఆ పిల్లలను ఏమైనా చేస్తాడని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆ పిల్లలకు హాస్టల్లో ఆశ్రయం కల్పించి వారి భవిష్యత్తుకు బాట వేయాలని మానవతావాదులు కోరుతున్నారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి కేంద్రం రెడ్ సిగ్నల్!

(మొదటి పేజీ తరువాయి)

రూ.553 కోట్ల ఖర్చవుతుందని అప్పట్లో అంచనా వేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి 227 ఎకరాల భూమిని కేటాయించింది. 2014 ఫిబ్రవరి 23న అప్పటి కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి కర్నూలు రైల్వే స్టేషన్ నుంచి ఈ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. రూ.110 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. పలు లక్ష్యాలతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు. తుప్పు పట్టిన రైల్వే కోచ్‌లకు మెరుగులు దిద్దడం, యాంటీరొరోసివ్ ఫైబర్ గ్లాస్ టిష్యూలను మళ్లీ వేయడం, రైల్వే కోచ్‌లలో ఫ్లోరింగ్ పునరుద్ధరణ తదితర పనులు ఇక్కడ జరుగుతాయి. షాక్ అబ్జర్వర్లను మారుస్తారు. సైడ్ ప్యానెల్‌లను పునరుద్ధరిస్తారు. రీవైరింగ్ చేయడంతో పాటు అన్ని ఆల్టర్నేటివ్ బెల్ట్‌లు మారుస్తారు. మొత్తంగా రైల్వే కోచ్ పునరుద్ధరణకు అన్ని రకాల చర్యలను ఈ కోచ్ ఫ్యాక్టరీలో చేపడతారు. ఈ కోచ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసే అత్యాధునిక కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ యంత్రాలు, హెవీ మెటీరియల్ హ్యాండ్లింగ్ పరికరాలు సంవత్సరానికి 250 కోచ్‌లను పునరుద్ధరించేలా ప్రణాళికలు రూపొందించారు. నాన్ ఎసి రైల్వే కోచ్ పునరుద్ధరణకు రూ.36 లక్షలు, ఎసి కోచ్ పునరుద్ధరణకు రూ.45 లక్షల చొప్పున వెచ్చించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

2019 నాటికి ఈ కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాంగ్రెస్ తర్వాత కేంద్రంలో అధికారంలోకొచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీని పట్టించుకోలేదు. గత పదేళ్లలో ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయితే వెయ్యి మంది యువతకు ఉపాధి లభిస్తుంది. మోడీ ప్రభుత్వం ఈ కోచ్ ఫ్యాక్టరీపై వివక్ష చూపుతున్నా రాష్ట్రంలోని గత టిడిపి ప్రభుత్వం, ఇప్పటి వైసిపి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించాయి. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేసేలా కేంద్రంతో ఎలాంటి సంప్రదింపులూ చేపట్టలేదు.


త్వరగా పూర్తి చేయాలి

రైల్వే కోచ్ పునరుద్ధరణ ఫ్యాక్టరీకి పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయాలి. ఈ ఫ్యాక్టరీని నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి రాయలసీమ యువతకు ఉపాధి కల్పించాలి. మోడీ అధికారంలోకి వచ్చాకా ఉన్న సంస్థలను అమ్మడం తప్ప, కొత్త సంస్థలను ఏర్పాటు చేయడం లేదు. అందువల్లే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం సాగడం లేదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధించడంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు, కర్నూలు జిల్లా ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలం కావడంతో నేటికీ నిర్మాణ దశలోనే ఉంది. ఇది పూర్తయితే యువతకు ఉపాధి లభించేది. యువత ఆలోచించి ఈ ఎన్నికల్లో అలాంటి పార్టీలకు బుద్ధి చెప్పాలి.

- ఇరిగినేని పుల్లారెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

సిపిఎం సీనియర్ నేత వల్లభనేని కృష్ణమూర్తి కన్నుమూత


ప్రజాశక్తి-భట్టిప్రోలు (బాపట్ల జిల్లా)



సిపిఎం సీనియర్ నాయకులు, విశ్రాంత వైద్యులు వల్లభనేని కష్ణమూర్తి (81) ఆదివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని ఆయన కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కృష్ణా జిల్లా మొవ్వ పంచాయతీకి చెందిన కృష్ణమూర్తి హోమియో వైద్యులు. 1972లో బదిలీపై కొల్లూరు వచ్చారు. సమీపంలోని ఆముదాల్లంక గ్రామంలో నివాసముంటున్నారు. అక్కడ వైద్యునిగా సేవలందిస్తూనే సిపిఎం భావాలతో ముందుకు సాగారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. జోలపాలెం నివేశనా స్థలాల పంపిణీ, రాగిలంక భూముల పోరాటంలో కీలక పాత్ర పోషించారు. రావిలంక భూముల పోరాట కమిటీలో సభ్యునిగా ఉన్నారు. ఎంతో నిబద్ధత కలిగిన నాయకులుగా ఉన్న కృష్ణమూర్తి కొల్లూరు, తదితర ప్రాంతాల్లో వైద్యులుగా కూడా గుర్తింపు పొందారు. కరోనా సమయంలో బాధితులకు వైద్య చికిత్స అందించి.. ఎనలేని కషి చేశారు. కృష్ణమూర్తి అంత్యక్రియలు సోమవారం విజయవాడలో జరుగుతాయని సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు వేములపల్లి వెంకటరామయ్య తెలిపారు. కృష్ణమూర్తి మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ఆయన సేవలను జ్ఞప్తికి తెచ్చారు.

ఉక్కు ప్రయివేటీకరణతో నిర్వాసితులకు నష్టం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగితే ఉద్యోగులకే కాకుండా ఉక్కు నిర్వాసితులకూ తీవ్ర నష్టం జరుగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1137వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి అనుబంధ కాంట్రాక్టు కార్మిక సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణతోనే కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు 30 ఏళ్లుగా ప్లాంట్‌లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తమ పిల్లలకైనా న్యాయం జరుగుతుందనే ఆశతో ఎక్కువమంది ఉన్నారన్నారు. ప్లాంట్ ప్రయివేటీకరణ అంశం ఇప్పుడు వీరిని తీవ్ర ఆందోళన పరుస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనలను తిప్పికొట్టేందుకు అందరూ సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సురక్షిత ప్రదేశంలోకి కంటైనర్ ?

- సిబిఐ ఆదేశాలతో సరుకుకు భద్రత
- నాలుగైదు రోజుల్లో శాంపిల్స్ ఫలితాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పోర్టు టెర్మినల్‌లో సిబిఐకి పట్టుబడ్డ 25 వేల కిలోల డ్రగ్ కంటైనర్‌ను ఇప్పుడున్న ప్రదేశం నుంచి అదే టర్మినల్‌లోగల మరింత సురక్షిత ప్రదేశానికి సిబిఐ అధికారులు ఆదివారం రాత్రి తరలించినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం కంటైనర్‌లోని డ్రై ఈస్ట్ శాంపిల్స్‌ను ఢిల్లీకి పంపారు. ప్రభుత్వ సెలవులు కావడంతో నాలుగు రోజులు ఆలస్యంగా అంటే ఈ నెల 29వ తేదీ నాటికి ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయని తెలుస్తోంది. డ్రై ఈస్ట్ (రొయ్యల మేత)లో ఎంత శాతం డ్రగ్ కలిసి ఉందన్న అంశం, మొత్తంగా 25 వేల కిలోల్లో ఎంత డ్రగ్ పరిమాణం ఉందన్న విషయం త్వరలో శాంపిల్ ఫలితాలతో బయటపడనున్నాయి. బ్రెజిల్ నుంచి ఇన్‌యాక్టివ్ డ్రై ఈస్ట్ పేరుతో విశాఖపట్నం పోర్టు కంటైనర్‌లోకి వచ్చిన ఈ 25 వేల కిలోల డ్రగ్స్‌ను సిబిఐ అధికారులు అక్కడికక్కడే తనిఖీలు చేసి సీజ్ చేసిన సంగతి తెలిసిందే. కంటైనర్‌ను ఆర్డర్ చేసిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీకి చెందిన రాష్ట్రంలోని కాకినాడ, విశాఖపట్నం, కృష్ణా జిల్లా పామర్రు ప్రాంతాల్లో డాక్యుమెంట్ల పరిశీలన ఈ నెల 23న పూర్తయినట్లు తెలుస్తోంది. సరుకు ఎగుమతి, దిగుమతులపైనా, కొన్నాళ్లుగా ఈ సంస్థ చేపట్టిన కార్యకలాపాలపైనా సిబిఐ తాజాగా దృష్టిసారించినట్లు సమాచారం. ప్రస్తుతం టెర్మినల్‌లో సీజ్ చేయబడ్డ 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌కు కేంద్ర బలగాలతో రాత్రీ, పగలు గస్తీ ఏర్పాటు చేశారు.

వ్యవస్థలను నిలబెట్టేది మీడియానే

- తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి జర్నలిజానికి ఉందని, దిగజారిపోతున్న వ్యవస్థలను నిలబెట్టేది మీడియానే అని ఐజెయు జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యాన విజయవాడ గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో 'సార్వత్రిక ఎన్నికలు - మీడియా పాత్ర' అనే అంశంపై ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి వందల కోట్లు ఖర్చు చేస్తున్నా.. ఎన్నికల సంఘం కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తోందన్నారు. రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా డబ్బు సమకూరుతోందన్నారు. కేంద్రం వర్కింగ్ జర్నలిస్టులకు ఉన్న చట్టాన్ని రద్దు చేసి జర్నలిస్టులను మెడికల్ రిప్రజెంటేటివ్స్ కేటగిరిలో చేర్చిందన్నారు. పోటీ చేసే అభ్యర్థులపై క్రిమినల్ కేసులు, నేరారోపణలు ఉంటే ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వి లక్ష్మణరెడ్డి, ప్రొఫెసరు ఎంసి దాస్, ఐజెయు కార్యదర్శి డి సోమసుందర్, ఐజెయు కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, విజయవాడ యూనిట్ అధ్యక్షులు చావా రవి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర సంపాదక మండలి ఛైర్మన్ కె రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఛైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సి రాఘవాచారి రాసిన సంపాదకీయాల మూడవ సంపుటి 'రాజ్యాంగం, న్యాయస్థానాలు, చట్టసభలు పుస్తకాన్ని రాఘవాచారి ట్రస్టు సభ్యులు బి జమీందర్, అక్కినేని చంద్రరావు అందజేశారు.


జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

మంచిర్యాలలో వైభవ్ జ్యూయలర్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్రా, తెలంగాణల్లో ప్రఖ్యాతిగాంచిన వైభవ్ జ్యూయలర్స్ (మనోజ్ వైభవ్ జెమ్స్ 'ఎన్' జ్యూయలర్స్ లిమిటెడ్) తన 15వ బ్రాంచిని తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాలలో శ్రీ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా, గంగారెడ్డి రోడ్డులో ఆదివారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి సర్వోదయ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ విష్ణువర్ధనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. షోరూమ్‌ను ఇతర అతిథులతో కలిసి ప్రారంభించారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు తోగరు సుధాకర్, వెంకటేశ్వర షాపింగ్ మాల్ ఎమ్‌డి నల్లా వెంకట నారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ ప్రయివేట్ లిమిటెడ్ ఎమ్‌డి గుర్రల శ్రీధర్ తొలి కొనుగోలు చేశారు. ప్రారంభ కార్యక్రమంలో వైభవ్ సంస్థల సిఎమ్‌డి గ్రంధి భారత మల్లికా రత్నకుమారి, సిఓఓ గొంట్ల రాఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేష్, వైభవ్ జ్యూయలర్స్ ఏలూరు ఎమ్‌డి గ్రంధి అమరేంద్ర పాల్గొన్నారు.

చికెన్ వ్యాపారి కిడ్నాప్

- గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - కొత్తచెరువు (శ్రీసత్యసాయి జిల్లా)



శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన చికెన్ సెంటర్ వ్యాపారి ఆదివారం కిడ్నాప్‌నకు గురయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు నిందితులను గంటల వ్యవధిలోని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తచెరువుకు చెందిన చెకెన్ సెంటర్ వ్యాపారి ఉప్పు చలపతి తెల్లవారుజామున తన ఇంటి నుంచి చికెన్ సెంటర్‌కు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. ఇంటి బయటకు వచ్చిన ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు ఎనిమిది మంది రెండు కార్లలో వచ్చి కిడ్నాప్ చేశారు. దీంతో, చలపతి కుటుంబ సభ్యులు కొత్తచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు ఆ ప్రాంతంలో సిసి కెమెరాలను పరిశీలించారు. కారు బుక్కపట్నం వైపునకు వెళ్లినట్లు గుర్తించి బుక్కపట్నం, ముదిగుబ్బ పోలీసులను అప్రమత్తం చేశారు. తనిఖీలు చేపట్టిన పోలీసులు ముద్దుగుబ్బ వద్ద ఐదుగురు నిందితులతో ఉన్న కారును అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన కారులో చలపతి ఉండడంతో ఆయనతో మాట్లాడి వివరాలు సేకరించారు. మరో కారులో ఉన్న ముగ్గురు నిందితులు కారుతో సహా పరారయ్యారు. నిందితుడిలో ఒకరు చలపతికి స్వయాన బావమరిదిగా గుర్తించారు. గతంలో చలపతిని ఆయన బావమరిది అధిక మొత్తంలో డబ్బులు ఇవ్వాలని అడిగాడని, అందుకు నిరాకరించడంతో ఈ కిడ్నాప్‌నకు ప్రయత్నించాడని చలపతి కుటుంబ సభ్యులు తెలిపారు. మరొక కారులో ముగ్గురు వ్యక్తులు పరారయ్యారని, వారికోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని సిఐ రాజా రమేష్ తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బండారు సత్యనారాయణమూర్తి

మాజీ మంత్రి బండారుకు అస్వస్థత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు బండారు సత్యనారాయణమూర్తి అస్వస్థతకు గురయ్యారు. బిపి, సుగర్ పెరగడంతో ఆదివారం ఉదయం విశాఖ నగరంలోని మహారాణిపేటలో ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. పెందుర్తి టికెట్ ఇవ్వకపోవడంతో బండారు కొద్ది రోజులుగా తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనయ్యారు. బిపి, సుగర్ నియంత్రణలో లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు ఆయన కుమారుడు అప్పలనాయుడు తెలిపారు. సత్యనారాయణమూర్తి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

మాధవరం 'ఆత్మహత్య'లపై విచారణకు ఆదేశించాలి

- కారకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ డిమాండ్



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి - వైఎస్ఆర్ జిల్లా ప్రతినిధి

వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం చేనేత కుటుంబం ఆత్మహత్యకు కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ డిమాండ్ చేశారు. మాధవరంలో శనివారం ఆత్మహత్యకు పాల్పడిన సుబ్బారావు కుటుంబీకులను సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ బృందంతో కలిసి ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గఫూర్ మాట్లాడుతూ 2015లో ఒంటిమిట్ట పొలం పరిధిలోని సర్వే నెంబర్ 218.2, ఖాతా నెంబర్ 1712లో 2.10 ఎకరాల పొలాన్ని ప్రభుత్వం సుబ్బారావు తండ్రి చలపతికి మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గ వైసిపి నేతల అనుచరులు అప్పటి తహశీల్దార్, ఆర్‌డిఒల సహకారంతో సుమారు 600 ఎకరాలపైగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు తొలగించి అనర్హుల పేర్లను ఎక్కించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. ఇందులోని నిజానిజాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత జిల్లాలో చోటుచేసుకున్న భూకబ్జాతో నిండు కుటుంబం బలి కావడంపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఆత్మహత్యలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులైన అధికారులు, వైసిపి నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో చోటుచేసుకునే ఇటువంటి దురాగతాలకు వైసిపి సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అండగా ఉంటాం : మాధవరంలో ఆత్మహత్య చేసుకున్నవారి కుటుంబ సభ్యులకు సిపిఎం అండగా ఉండి పోరాటం చేస్తుందని, సాధ్యమైన మేరకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తామని గఫూర్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని, విచారణకు ఆదేశించాలని కలెక్టర్‌ను కోరతామన్నారు. బాధిత కుటుంబాన్ని దక్కేలా ప్రయత్నించడంతో పాటు కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం తక్షణమే అందజేయాలని కోరతామని తెలిపారు. పిఎం కిసాన్ నిధులు జమ దగ్గర నుంచి కుటుంబ అప్పుల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, ఒంటిమిట్ట, సిద్ధవటం మండల కార్యదర్శులు కోనేటి నరసయ్య సురేష్‌బాబు ఉన్నారు.



బస్సులో ఉన్న ఫైల్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) కొత్త మూలపేటలో నిలిచి ఉన్న బస్సు

సంధ్య ఆక్వా బస్సులో తనిఖీలు

- ఫైల్స్, కంప్యూటర్, పరికరాలు స్వాధీనం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

విశాఖపట్నంలో ఇటీవల భారీగా డ్రగ్స్ దొరకడంతో రాష్ట్రం మొత్తం ఉలిక్కిపడింది. డ్రగ్స్ కేసులో సంధ్య ఆక్వా పరిశ్రమకు సంబంధం ఉందన్న నేపథ్యంలో ఆ పరిశ్రమలో సిబిఐ అధికారులు దాడులు నిర్వహించారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఉన్న సంధ్య ఆక్వాలో కూడా రెండు రోజులపాటు సిబిఐ అధికారులు దాడులు నిర్వహించి వెళ్లారు. ఈ నేపథ్యంలో కొత్త మూలపేట ఎస్‌ఇజెడ్ కాలనీలో సంధ్య ఆక్వాకు చెందిన బస్సు నాలుగు రోజులుగా నిలిపి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు ఆదివారం సమాచారం ఇచ్చారు. పోలీసులు బస్సు ఉన్న ప్రదేశానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. బస్సులో రికార్డులు, కంప్యూటర్ పరికరాలు, ఫైల్స్, కొత్త చెక్ బుక్స్, మిషనరీ సామగ్రి ఉన్నట్లు గుర్తించి వాటని స్వాధీనం చేసుకున్నారు. బస్సును సీజ్ చేశారు. ఎస్ఐ స్వామి నాయుడు మాట్లాడుతూ కాకినాడ నుంచి వస్తుండగా బస్సుకు బ్రేక్‌డౌన్ అయ్యిందని, కంపెనీ సూపర్‌వైజర్ మహేష్ అదే గ్రామంలో నివసిస్తుండడంతో బస్సును ఇక్కడ నిలిపినట్లు కంపెనీ ప్రతినిధులు చెప్పారని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

సిఎస్ కోరినవి నిబంధనలకు విరుద్ధం

- సిఇఒకు అచ్చెన్నాయుడు ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన అనుమతుల కోసం అజెండాలో కోరారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు ఆదివారం లేఖ రాశారు. ఈ నెల 22, 23 తేదీల్లో వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నుంచి అనుమతుల కోసం అజెండాను తయారు చేశారని పేర్కొన్నారు. టెట్ పరీక్షల ఫలితాలు ప్రకటించాలని, 6,100 డిఎస్‌సి పోస్టులు భర్తీ చేయాలని, పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ డివి ప్రకాష్‌ను జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని, ఎస్‌కె సలీం బాషాను గుంటూరు డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించేందుకు అనుమతులు కోరుతూ లేఖ రాశారని తెలిపారు. సుమారు 30కు పైగా ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన అనుమతులు కోరారని పేర్కొన్నారు. ఈ అంశాలు ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నారు. మూడు రోజుల్లో నాలుగుసార్లు లోకేష్ కాన్వాయ్‌ను తనిఖీ చేయడం ప్రత్యేకంగా టార్గెట్ చేయడం కాదా? అని అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పటికీ మంగళగిరిలో జగన్ బొమ్మలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్నా ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు.

జగన్ భూ దాహానికి సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య : అనురాధ

జగన్ భూ దాహానికి సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుందని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. కొందరు అధికారుల అండతో భూముల రికార్డులు తారుమారు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం న్యాయం చేయదనే ఆవేదనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సుబ్బారావు లేఖలో పేర్కొన్నారని అన్నారు. సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు టిడిపి కమిటీని ఏర్పాటు చేసింది. నాయకులు కొల్లు రవీంద్ర, నిమ్మల కృష్ణప్ప, కందికుంట వెంకటప్రసాద్, శ్రీరామ్ చినబాబు, మడక చక్రధర్ సోమవారం కుటుంబాన్ని పరామర్శించనున్నారు.

సి విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన యువకుడిపై దాడి

ప్రజాశక్తి - వీరులపాడు (ఎన్‌టిఆర్ జిల్లా)



ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై సి విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన యువకుడిపై వైసిపి నాయకులు ఆదివారం దాడి చేశారు. మండలంలోని వైసిపి కార్యాలయానికి రంగులు తొలగించకపోవడంతో మండల పరిధిలోని జుజ్జూరు గ్రామానికి చెందిన షేక్ నాగుల్ బాషా సి విజిల్ యాప్‌లో ముగ్గురిపై ఫిర్యాదు చేశారు. స్పందించిన సంబంధిత అధికారులు ఆ కార్యాలయానికి ఉన్న రంగులు తొలగించి, సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో వైసిపి నాయకులు బాషాపై దాడికి దిగారు. దీంతో వీరులపాడు పోలీస్ స్టేషన్‌లో బాషా ఫిర్యాదు చేశారు. పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని, వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్య లు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఎస్ఐ మహాలక్ష్ముడు ఇద్దరి జామిన్‌తో అదుపులోకి తీసుకున్న వ్యక్తులకు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు.

2025 నాటికి 'క్షయ'ను నిర్మూలిస్తాం

- రాష్ట్ర టిబి అధికారి టి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్షయ వ్యాధిని 2025 నాటికి పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో జాతీయ క్షయ నివారణ కార్యక్రమాన్ని (ఎన్‌టిఇపి) రాష్ట్రంలో పటిష్టంగా నిర్వహిస్తున్నామని వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టరు, రాష్ట్ర టిబి నివారణ అధికారి టి రమేష్ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడలో ఆరోగ్యశాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నర్సింగ్, ఫార్మా కళాశాల విద్యార్థులు, ఎన్‌టిఇపి భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతోన్న టిబి కేసుల్లో దాదాపు 24 శాతం దేశంలోనే నమోదవుతున్నాయని, మరణాలూ ఎక్కువగా దేశంలోనే నమోదవుతున్నాయని తెలిపారు. ఈ వ్యాధిని పూర్తిగా రూపుమాపేందుకు రాష్ట్రంలో 720 ట్రూనాట్, 50 సిబినాట్ సెంటర్ల ద్వారా ఏటా పది లక్షలకు పైగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ పథకాన్ని ఈ సంవత్సరం చేపడుతున్నామని, మొదటిగా 12 జిల్లాల్లో నిర్వహించేందుకు సర్వే జరుగుతోందని చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార భద్రత కల్పించేందుకు న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్నామని, ఇప్పటి వరకు 95 వేల కిట్లను బాధితులకు అందించామని వివరించారు. క్షయ వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్లు జె ఉషారాణి, ప్రమోద్ చలసాని, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో మాకు సంబంధం లేదు... : విజయసాయి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

విశాఖపట్నం డ్రగ్స్ కేసులో వైసిపికి ఎలాంటి సంబంధమూ లేదని ఎంపి, నెల్లూరు వైసిపి అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ బ్రెజిల్‌లో ఎన్నికలు జరిగినప్పుడు, అక్కడ ఎన్నికైన ప్రభుత్వానికి వైసిపి పార్లమెంట్ ఫ్లోర్ లీడర్‌గా శుభాకాంక్షలు చెప్పానని, దీనికి, వైజాగ్‌కు వచ్చిన డ్రగ్స్‌కు ఏమి సంబంధమని ప్రశ్నించారు. డ్రగ్స్ విషయంలో టిడిపి నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు. సిబిఐ విచారణ అనంతరం ఎవరి ప్రమేయం ఏమిటో బయట కొస్తుందన్నారు. అరబిందో ఎలక్ట్రోరల్ బాండ్ల విషయంలో టిడిపి నేతలు విమర్శలు గుప్పిస్తున్నారని, గత ఎన్నికల్లో ఎంత తీసుకున్నారో తన వద్ద లెక్కలున్నాయని వివరించారు. అధికార పార్టీకి ఒక్క రూపాయి ఇస్తే, ప్రతిపక్షాలకు కనీసం పావలా అయినా వ్యాపారులు బాండ్ల రూపంలో ఇస్తారన్నారు. దీనిని రాజకీయం చేయడం సరికాదని పేర్కొన్నారు. తనకు విశాఖలో ఓటు ఉందని, దానిని నెల్లూరుకు మార్చుకుంటానని, భవిష్యత్తులో తన సొంత ప్రాంతమైన నెల్లూరులోనే ఇల్లు నిర్మించుకుంటానని చెప్పారు. విలేకర్ల సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ నుండి వంద మంది కార్యకర్తలు వైసిపిలో చేరారు. వారికి విజయసాయిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సాక్షి మీడియాపై రూ.20 కోట్లకు పురందేశ్వరి పరువు నష్టం దావా

అమరావతి బ్యూరో: ఉద్దేశపూర్వకంగానే సాక్షి మీడియాలో ఎలాంటి ఆధారాలు లేని కథనాలు ప్రచురిస్తున్నారని, తమ పరువుకు భంగం కలిగిందని ఆరోపిస్తూ రూ.20 కోట్లకు నష్టపరిహారం చెల్లించాలంటూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి పరువు నష్టం దావా వేశారు. ఈ మేరకు సాక్షి యాజమాన్యానికి ఆదివారం లీగల్ నోటీసు పంపారు. రెండు వారాల్లో సమాధానం రాకపోతే తదుపరి చర్యలకు వెళ్తామని నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు బిజెపి మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం ఒక ప్రకటన విడుదల చేశారు.

అడుగంటిన జలాశయాలు

- శ్రీశైలంలో 34.788 టిఎంసిలు
- తుంగభద్రలో 5.48 టిఎంసిలు
- రబీ సాగును విరమించుకున్న రైతులు
- తాగునీటికీ కటకట



అడుగంటిన శ్రీశైలం జలాశయం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గత దశాబ్ద కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు ఎన్నడూ లేని దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నారు. ఆంధ్ర రాష్ట్రంతోపాటు పక్క రాష్ట్రాలకు సాగు, తాగు నీటిని అందిస్తున్న శ్రీశైలం జలాశయంతోపాటు తుంగభద్ర జలాశయాలు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. ఫలితంగా నిన్న మొన్నటి దాకా కాస్తో కూస్తో నీరు ఉండిన కెసి కెనాల్, లో లెవల్ కెనాల్ (ఎల్ఎల్‌సి), శ్రీశైలం రైట్‌బ్యాంకు కెనాల్ (ఎస్ఆర్‌బిసి), తెలుగు గంగ, గాజులదిన్నె ఎండిపోయాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన జలాశయాలతోపాటు చిన్న నీటి వనరుల ద్వారా దాదాపు ఆరు లక్షల ఎకరాలు సాగవుతోంది. ఖరీఫ్ సీజన్‌లోనూ కెసి కెనాల్, ఎల్ఎల్‌సి, ఎస్ఆర్‌బిసి, తెలుగు గంగ తదితర ప్రధాన కాలువల ద్వారా అతికష్టం మీద అధికారులు నీటిని విడుదల చేశారు. రబీలో ఆరుతడి పంటలకైనా నీరు ఇస్తారేమోనని రైతులు ఎదురు చూసినా నిరాశే మిగిలింది. జలశయాల్లో నీటి నిల్వలు పడిపోవడంతో రబీ పంటలకు నీరు ఇవ్వలేమని అధికారులు చేతులెత్తేశారు. దీంతో రైతులు సాగును విరమించుకున్నారు. రబీలో దాదాపు ప్రధాన కాలువల కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందాలి. ఈసారి ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందివ్వకపోవడంతో పొలాలన్నీ బీడువారాయి.

మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడుకు కూడా తాగునీరందించే ఏకైక మార్గంగా ఉన్న శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 34.788 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. గత సంవత్సరం ఇదే సమాయానికి 35.3770 టిఎంసిల నీరు నిల్వ ఉండేది. ఈ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలు కాగా, గత సంవత్సరం దాదాపు ఏడు సార్లు జలాశయం పూర్తిగా నిండడంతో దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సారి మొదటి నుంచి ఆ పరిస్థితి లేదు. తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా గత సంవత్సరం ఇదే సమయానికి 50 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం 5.48 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉందని, ఎగువ నుంచి చుక్కనీటి ప్రవాహం కూడా జలాశయంలోకి రావడం లేదని, ఈ పరిస్థితుల్లో జూన్ వరకు తాగునీటి అవసరాలను ఏవిధంగా తీర్చాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. గత దశాబ్ద కాలంలో తుంగభద్ర జలాశయంలో ఈ పరిస్థితి నెలకొనడం ఇదే మొదటిసారి అని అంటున్నారు.

కర్నూలుకు తాగునీటి అవసరాలు తీరుస్తున్న సుంకేసుల జలాశయంలో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.2 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.881 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. తాగునీటి అవసరాల కోసం ప్రతి రోజూ 159 మిలియన్ లీటర్ల నీరు అవసరం. గాజులదిన్నె జలాశయంలో 4.5 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యానికిగాను 1.845 టిఎంసిలు ఉన్నాయి. జూన్ వరకు ఎమ్మిగనూరు, కోడుమూరు, డోన్‌తోపాటు కర్నూలు తాగునీటి అవసరాలను ఈ కొద్దిపాటి నీటితో ఎలా సర్దుబాటు చేయాలో అర్థం గాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కృష్ణగిరి జలాశయంలో 0.164 టిఎంసిలకుగాను 0.68 టిఎంసిలు ఉన్నాయి. జూన్ వరకు తాగునీటి అవసరాలను ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు ఏ విధంగా అందించాలో అర్థం కావడం లేదని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

బిజెపిలో చేరిన గూడూరు వైసిపి ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గూడూరు టౌన్ (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా గూడూరు వైసిపి ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు బిజెపిలో చేరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆదివారం వరప్రసాద్‌రావుకి పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రావు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి ఘనవిజయం సాధిస్తుందని పేర్కొన్నారు.

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 విజయవాడ

సోమవారం 25 మార్చి 2024



"క్షణము గడిచిన దాని

వెన్కకు మరల్ప

సాధ్యమే మానవున

కిలాచక్రమందు"

– గుర్రం జాషువా



వాన కోసం ...

ఎందుకో గానీ
ఈ వత్సరం మరింత
ఎండ సుడిగుండమౌతోంది
దాహపు రాగం ఎత్తుకుని
పట్నం వలసపోతోంది
పల్లె రైతు ఎండిన పంటతో
తల్లడిల్లుతున్నాడు!

బోరు మూగబోతే
గుండె చెరువైపోతే
జొన్నపంట కన్నీరు కురుస్తోంది!
కలలు కనే రైతు కతలు
వెతలుగా మిగులుతున్నాయి

వడ్డీలు నడ్డి విరుస్తోంటే
బతుకు సాకటం శోకమౌతోంది
మట్టి పగుళ్లలో
పరిమళం కోసం నిట్టూరుస్తున్నా...
కాల ప్రవాహంలో
ఎన్ని వసంతాలు
నా ముందు నుంచే వెళ్ళిపోయినా
ఇంకా శిశిరంలా చూపులు
వానకోసం కోసం రాలిపోతున్నాయ్!

దోసిళ్ళలో
కాసిన్ని నీటి చుక్కలు దాచుకోవాలి
ఇప్పుడు రైతంటే వెనకబడ్డ అంగడి సరుకు
అయినా
మట్టిని నమ్ముకున్న మనుషులకు
ఆకలి తీర్చడం తప్పా బతుకులో
ఎండని ఒంపటం తెలీదు!

– గవిడి శ్రీనివాస్
7019278368

శిథిల శరీరులు

పూర్వం ఇక్కడో గుడి ఉన్నట్టు తెలుసు
దాని చుట్టుపక్కల నది ప్రవహిస్తున్న జ్ఞాపకమూ వుంది.
అక్కడ!
బతకలేక, జీవితాన్ని బతుకుతున్న
శిథిల శరీరులెందరో
ఆకలి వేడుకలు జరుపుకున్నట్టు
యాదికి నాలో ఇంకా సజీవంగా వుంది!

అర్ధరాత్రి హఠాత్తుగా అంతా నిశ్శబ్దం!
నిర్మానుష్యం, గుడి లేదు,
గుడిసెలు లేవు.
అంతా ధ్వంసం
నది పక్కన దీర్ఘ నిద్రలో
ఉన్న నిర్వాసితులే
అందుకు ప్రత్యక్ష సాక్ష్యం!
తర్వాత మరో వీధి వాడి లక్ష్యం.
కొండలు, నదులు, శ్మశానాలు
మింగేసే కబ్జాదారులు
ఆక్రమణ స్థానంలో
ఇండస్ట్రియల్ కాంప్లెక్స్!



వాడు నడుస్తున్నంత మేరా
దేశభక్తి వాసన పులుముకుంటాడు
ఆధ్యాత్మికతను అలంకరించుకుంటాడు
జనం ఎందుకు ఏడుస్తున్నారో
వేరే చెప్పాలా?
భూ బకాసురులు
భూమంతా ఆక్రమించుకుంటున్నారు
వాడు మృత్తికలో నివాసం వుండే రోజెప్పుడో!?

– అనిత గండమళ్ల

కాలచక్రంలో 'అతడు'

మడమ తిప్పని బతుకు పోరాటంలో...
ఆ కడుపులో దాగిన కష్టాల బరువెంతో?
ఏ రాజు చెప్పును! అసలు 'తరాజు' కొలతెంతో!
మాయల దళారుల అక్కసు మాటల్లో
చిక్కిన అమాయకుల కన్నీటి గాథల్లో
ఏ సంద్రం వింటుందో ఆ మనసు మాట.

పొద్దే ఎరిగిన పొద్దు తిరుగుడుకు
ఆ వెనుక దాగిన చీకటి తెలియక
తలెత్తే చూస్తుంది నిత్యం ఎరగక
ప్రతి యంత్రాన్ని నడిపించే ఆ మనిషి
మళ్లీ యంత్రం చెప్పినదే వింటున్నాడే
మరి ఏమైపోయెను తన కాన్ఫిడెన్స్!

వితౌట్ షుగర్ టీ వాళ్ళే ఎక్కువయ్యే..
పెరిగెను తీయదనం లేని బంధాలు!
నిండుగా నిండెను చిక్కదనం లేని ఫ్యామిలీ టీ కప్పు!

మనలో ఓ భాగం మాత్రమే అయ్యేది..
తనలో అదే పూర్తి భాగమయ్యేనే...
మనీ ఓన్లీ... సెల్ఫ్ గోల్ అయింది!

మనసు లేని మనిషి మినరల్ నీరే తాగే
మినిమం మాటే బంగారమాయేనే
మరేమో... నిండెను ఆన్‌నీడ్ కన్వర్జేషన్లు...

గుప్పెడు క్వాలిటీ లేని క్యారెక్టర్‌లో
గ్రూపుల సంఖ్యనేమో కుప్పలు తెప్పలుగా
అన్ యూస్డ్ అన్నీ పడేసెయ్యి చెత్తబుట్టల్లో...

రీ ఫ్రెష్‌గా నీ రియాలిటీతో...
నీవేంటో తెలుపు ఓ సారి, మరోసారి!
కొత్తగా, సరికొత్తగా ...

– డా.చిటికెన కిరణ్ కుమార్
94908 41284

కవిత్వంలోకి వొంపిన జీవన వైభవం!

సమీక్ష



మనిషి కన్నా ముందు కవిత్వాన్ని రాసిందీ పాడిందీ ప్రకృతే! చెట్ల కొమ్మల మీద మెటాఫర్లు అంత్యప్రాసల నాట్యమాడుతాయి. వానచుక్కలు చెమటచుక్కల్ని కలుపుకొని మణిప్రవాళాలై పరుగులు దీస్తాయి. గాలి పాటకి తాళమేసే గరికపచ్చ గగనంలో కవిత్వపు పొద్దు పొడుస్తుంది. ప్రకృతంతా మాట్లాడాక ఆ వరుసలో చివరి కవితా శీర్షిక మనిషి.

చూరుకి వేళ్ళాడుతున్న రవికల గుడ్డ మెడని ముద్దు పెట్టుకున్నాక ఉండే అచేతనానికీ, ఉవ్వెత్తున ఎగసిపడే నవ యవ్వనపు చైతన్యానికీ కవిత్వం చుట్టమే, ఇది వయసు తప్పిన కవిత్వం ముసలాడిలో యువకుడిని చూపిస్తుంది, యవ్వనంలోకి అనుభవాన్ని మోసుకొస్తుంది. జీవితం కవిత్వం ఏ ఇద్దరికీ ఒకేలా అర్థమవవు. కవిత్వం కాలాన్ని కప్పుకొని పడుకున్న నిన్నటి జీవితం, అందుకే చదివిన ప్రతిసారీ కొత్తగా వినబడుతుంది. విన్న ప్రతి మాటా కొత్తగా చదివిస్తుంది. నాలుగు మాటల వాక్యమంత చిన్న జీవితం మనిషిది, పురుగుల మందు సీసా మూత తీసేంత సమయంలో చాలా జీవితాలు వాక్యాంతాల్లోకి ఒరిగిపోతాయి. అక్షరాలు మోయలేని బాధలెన్నో, కవిత్వంతో తుడవలేని కన్నీరెంతో, నక్షత్రాల అద్దం ముందు ముసుక్కప్పుకొని పడుకున్న మనిషి కళ్ళలోకి సూటిగా చూడలేక కవిత్వాన్ని పక్కకి తిప్పుకున్న కవులెందరో? మెట్టా నాగేశ్వరరావు కవి మాత్రం అక్కడే ఆగి ఒక్కడే నిలబడి గొంతెత్తి పాడుతున్నాడు. లోకమంతా చీకటిని ఒప్పుకున్నాక కూడా ఒక చిన్న వెలుగు రేఖని కలగంటున్నాడు.

ఏదో నాలుగు ప్రేమ కవితలు రాసుకొచ్చి మా చిగురు పెదాలపై చిరునవ్వులు మొలిపిస్తాడనుకుంటే, కోర మీసాల్ని రువ్వి పాత ప్రేమల్ని గుర్తు చేస్తాడనుకుంటే 'నాగలికత'లు చెపుతున్నాడీ నాగరికత నేర్చిన లోకానికి. ప్రణయాక్షరాలు నేర్పుతాడనుకుంటే శ్రమాక్షరాలు దిద్దిస్తున్నాడు. ఇది నాకెంత మాత్రం నచ్చలేదు. అసలీ కవిత్వమే నచ్చలేదు. లేకపోతే రైతు బొమ్మల్ని మా దేహాలపై పచ్చ పొడిపించుకోమంటాడా? అక్షరాల కళ్ళాపిని మా బతుకు పొద్దుల మీద చల్లి మెలకువలోకి జారిపోమంటాడా? ముంతల కావడిని భుజానికెత్తుకుని చిటికెనేలుతో పసిపోరన్ని పట్టుకొని బతుకు తేనె జుర్రుకు తాగమంటాడా? ఎంత అస్తవ్యస్తమైన కవిత్వం ఇది. అవును... అస్తవ్యస్తమైన కవిత్వమే ఇది! ఎందుకంటే మనిషి జీవితం కూడా అలాంటిదే. దాన్నే అక్షరాలా చూపిస్తుంది. అందుకే అలాగే వుంటుంది. అలాగే ఉంది. నీకూ నాకూ నచ్చకపోయినా మెట్టా ఒక్కడే మొదలెట్టి ఒక్కడే ముగిస్తాడు. నీకూ నాకూ వినపడే దాకా ఆకాశం నుంచీ, అగాథం నుంచీ, అన్ని దిక్కుల నుంచీ అన్నీ కాలాల్లోకి కవిత్వాన్ని ఒంపుతూనే ఉన్నాడు. కవిత్వపు వైవిధ్యాన్ని నిత్యనూతనంగా కలగంటున్నాడు.

ఇక్కడ కవిత్వం సమయాన్ని దాటి పరిగెడుతుంది. ఇది వ్యాకరణం లేని కవిత్వపు భాష. ఎందుకంటే మూల భావనలకు వ్యాకరణం అవసరం లేదు; అప్పుడే పుట్టిన బిడ్డకి బట్టలు అవసరం లేనట్టుగా. చాలాసార్లు మెట్టా కవిత్వం చదివి పుస్తకం మూసేసాక నిశ్శబ్ధంలో అసలు కవిత్వం వినబడుతుంది. గుక్కపట్టిన బాల్యానికీ, తిక్కపుట్టిన యవ్వనానికీ, మార్మికాల మనిషికీ తాత్వికబోధ చేస్తున్నాడు తన కవిత్వంతో. కళ్ళు మూసుకొని వున్నప్పుడు కళ్ళు తెరిస్తే, దారంతా తరువు పూలవాన కురిస్తే, నిశాచరం పొట్టపగిలి వెలుగుల్ని ప్రసవిస్తే అనుభవించడానికి కవిత్వం కన్నా గొప్ప మాధ్యమం ఏముంటుంది? అలా అనుభవించి రాసిన అందమైన కవిత్వం ఇది.

ఇది నా కవిత్వం అని మెట్టా లోకానికి సాక్ష్యం చెబుతున్నాడు. కాలపు దారానికి కవిత్వపు పూసలు గుచ్చుతున్నాడు. నిశరాతిరి నిద్దురని చెడగొట్టి మనసు చెవిలో ముచ్చట్లు చెప్పే ఆలోచనల జోరీగలు కవిత్వంలోంచి పుడతాయి. అమావాస్య చీకటికి తోటిమనిషి పున్నమి మోముని చూపించే వెలుగు దివ్వెలు కవిత్వంలోనే ఉద్భవిస్తాయి. అపరిచితాల రెక్కల్ని తెంపి మనసుల్ని కలిపే మహామంత్రాన్ని కవిత్వం కడుపునకంటుంది. ఇవన్నీ తెలిసి, కవిత్వం లోతూ, ఎత్తూ, బరువూ అన్నీ కొలిచి రాశాడు మెట్టా.

చెట్ల బెరళ్లకు గాయాల కాయలు కాస్తే సుతారంగా తాకి ఓదార్చడం తెలిసినోడికి, నాణానికి రెండోవైపు కూడా అపజయమే ఉన్నా గెలవడం తెలిసినోడికి, ఫ్రెంచ్, స్పానిష్, కొరియన్, రష్యన్, జర్మన్ యుద్ధాల క్షతగాత్రాల్ని తనలోనే పలికించి అనుభవించగలిగినోడికి మాత్రమే ఈ కవిత్వపు భాష తెలుసు. అక్షరాల మోముకి నిరాడంబరాల మెరుగులు దిద్ది, అనుభూతుల రసారవింద నేత్రాలతో శ్రామికతని నింపుకొని, భావోద్వేగాల హల్లులకి భాషతో తలకట్లు పెట్టి రాసిన కవితా సంకలనం ఇది. చీపురు చప్పుళ్ల సూర్యుడ్ని మేల్కొలిపినట్టు ఈ కవిత్వం మనిషిని మేల్కొలుపుతుంది.

సమూహాల భావజాలాలకి ఈ కవిత్వం అఆఇఈ, సమాజపు సినిమాకి ఈ కవిత్వం subtitles, సగటు మనిషి చరిత్రకి ఈ కవిత్వం reference.

కవిత్వం ముఖంమీద రాసుకున్న self బయోగ్రఫీ. చూడగానే నువ్వెవరివో అర్థమవుతుంది. నీ భావనల వంతెనలు ఎక్కి నీ దరికి వచ్చే మస్తిష్కాలు కూడా నీలాగే ఆలోచిస్తాయి, నీ అనుభూతుల్ని సొంతం చేసుకుంటాయి. అందుకే నీకోసం మాత్రమే రాసుకునే కవిత్వం కూడా విశ్వజనీనమవుతుంది. విశ్వాన్ని నీలో చూసుకుంటే ఎల్లలు లేని మనస్సు విశ్వమంతా నిండి కవిత్వాన్ని శాశ్వతం చేస్తుంది. ఇక్కడ కూడా మెట్టా నాగేశ్వరరావు కేవలం వాళ్ళ ఇంట్లోంచో, వాళ్ల ఊర్లోంచో రాసిన కవిత్వం ఇది, కానీ అలాంటి ఇల్లులే, అలాంటి ఊర్లే మనవి కూడా, అందుకే ఆ కవిత్వం మనది అయింది. మనలాగే మనకు వినిపిస్తుంది. లోతైన గాఢమైన భాషలు కొన్నింటిని విందాం.

"సూర్యబావిలోంచీ కాంతిజలాన్ని తోడుకుని లోపలి తానం చేస్తాను/ నేనే సూర్యుడయ్యాక, బతుకొక వేకువరాగం పాడుతోంది"

జ్ఞానాన్ని సంపాదించుకుంటూ, కాపాడుకుంటూ కవిత్వమై సాగుతానంటున్నాడు మెట్టా, కోరికల సంకెళ్లలో చిక్కుకోకుండా జ్ఞానజలంతో లోపలితానం చేసి వేకువరాగం పాడతానని సగర్వంగా ప్రకటించుకుంటున్నాడు.

"నేను సూఫీనవుతున్నాను/ హృదయాన్ని కన్నులుగా చూస్తున్నాను/ భ్రమలెపుడూ నా దృశ్యాలు కావడంలేదు"

ఈ వాక్యానికి ముందెప్పుడో మెట్టా సూఫీ అయ్యాడు. కన్నులతో చూస్తూ హృదయంతో దర్శించడం మొదలుపెట్టాడు. నిజాలనిచ్చెనలమీద అసలైన ప్రయాణానికి ఇది నాందీ వాక్యం.

"శబ్దాలన్నీ అలికిడిలోనే కాదు/ నిశ్శబ్దంలోనూ శబ్దాలుంటాయి/ పెదాల క్రమశిక్షణ నిశ్శబ్దానికి దారి"

అవును నిశ్శబ్దం కూడా భాషే! మాటల్లో చెప్పలేని ఎన్నో భావనలను నిశ్శబ్దంగా చెప్పొచ్చు. అసలు నిశ్శబ్దం ఉన్నతోన్నత భావవ్యక్తీకరణా ప్రక్రియ. పదాలమధ్య ఖాళీలతో కవిత్వం బాగా వినపడుతుంది.

"నీవు నేనూ ఒకటే శ్మశానం దగ్గర కలుసుకున్నాం/ బూడిదకుప్పగానూ సమానమయ్యాం!"

ప్రయాణాలన్నీ శ్మశానానికే అన్నట్టుగా అందరం అక్కడ కలుసుకొని మిగిలిపోయిన మాటల్ని మంటల్లో కలిపేసుకోవాల్సిందే. కుప్పపోసిన అసమానతలన్నీ అక్కడ కాలిపోవాల్సిందే. ఎవరి లోకంలో వాళ్ళున్నా అందరం ఒక్కటయ్యేది అక్కడే!


గులకరాళ్ళకు రెక్కలు కట్టి సాహిత్యాకాశంలో ఎగిరించిన కవి మెట్టా, తెల్లంగికీ చింతలతోపుకీ కొంకణి తీరానికీ కూడా కవితా సింహాసనమేసి కూర్చోబెట్టి గౌరవించాడు. పొక్కిలి లేచిన తండాల గుమ్మం ముందు కవిత్వంతో చుక్కలముగ్గులు పెట్టాడు. చీమలు, వాగులు, గడియారాలు, మబ్బులు అన్నింటితో కవితాక్షరాలనే దిద్దించాడు. లోకం ప్రేమదృశ్యమైంది. వాస్తవాలు చితిముందు చింతనలయ్యాయి, నదిమీది పడవలన్నీ అందమైన అక్షరాలయ్యాయి.

కవిత్వమంటే కేవలం ప్రతీకలే కాదు, ప్రత్యామ్నాయాలు కూడా. జీవన రణగొణ పరుగుల్లోంచి తప్పించి నడిపించే కళాత్మక మార్గం. ఆరుబైట పడుకుంటే వెన్నెలొచ్చి రాసే వెన్నపూస. కవిత్వం నిజాయితీగా, నిక్కచ్చిగా ఉంటుంది. నిన్ను నువ్వు మర్చిపోయేలా చేసి నిన్ను నీకు గుర్తు చేస్తుంది. కొంచెంసేపు కవి మెట్టాతో గడిపి మంచి కవిత్వాన్ని, మధ్య తరగతి జీవన వైభవాన్ని సంపూర్ణంగా అనుభవించే అవకాశం ఈ పుస్తకం. కవి మెట్టానాగేశ్వరరావుకి అభినందనలు.

– గౌతమ్ లింగా
దక్షిణాఫ్రికా
027630255994

'గోరఖ్‌పూర్' విషాదానికి అక్షర సాక్ష్యం!

పుస్తకం



వ్యవస్థలు వ్యక్తుల మీద పగ పడతాయా? ప్రజాస్వామ్యంలో ప్రజలంతా సమానమనే భావనా, ప్రజల చేత, ప్రజల కొరకు పాలించే ఆ వ్యవస్థలో న్యాయం అందరికీ సమానంగానే వర్తిస్తుందనీ, చట్టం ముందు అందరూ సమానులేననీ తరచూ వింటూ ఉంటాం. చాలా సందర్భాల్లో ఇవి రాసుకున్న ఆదర్శాలు మాత్రమేనన్న విషయం బోధపడుతూ ఉంటుంది. డాక్టర్ కఫీల్ ఖాన్ స్వయంగా రాసిన 'గోరఖ్పూర్ ఆసుపత్రి విషాదం' పుస్తకం తెలుగులో వచ్చింది. దీనిని చదివితే ఈ వ్యవస్థల డొల్లతనం, కుట్రకోణం మనకు అర్థమవుతాయి.

2017 ఆగస్టులో ఉత్తరప్రదేశ్ గోరఖ్పూర్లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బాబా రాఘవ దాస్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో అలక్ష్యం కారణంగా ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి 60 మంది శిశువులు మరణించటంలోని వ్యవస్థ నిర్వాకాన్ని ఈ పుస్తకం ప్రశ్నిస్తుంది. దోషులంతా ఎంచక్కా బయట తిరుగుతుంటే, పసిబిడ్డల ప్రాణాలను కాపాడటానికి తన వంతు కర్తవ్యంగా చేయగలిగిందంతా చేసిన డాక్టర్ కఫీల్ ఖాన్ ఎందుకు నిర్దాక్షిణ్యంగా శిక్షకు గురై సర్వం కోల్పోయి, నిస్సహాయంగా న్యాయం కోసం రోడ్డున పడాల్సిన పరిస్థితుల వెనక జరిగిన ఘోరాన్ని ఈ పుస్తకం కళ్ళకు కడుతుంది.

ఏఈఎస్ అనే మెదడు వాపు వ్యాధి 1978 తర్వాత 25 వేల మంది ప్రాణాలు తీసుకోవడంతో పాటు లక్ష మందిని శాశ్వత అంగవికలురుగా చేసింది. పేదరికం, సురక్షితమైన మంచినీటి సౌకర్యం, పోషణ లోపాలు, అపరిశుభ్రత, టీకా వేసుకోకపోవడం వల్ల వచ్చే ఈ వ్యాధిని కొంచెం చిత్తశుద్ధితో పనిచేస్తూ, టీకా డ్రైవ్‌ను కూడా నిర్వర్తిస్తే ప్రతి సంవత్సరం లక్షలాది పసిబిడ్డల ప్రాణాలు కాపాడబడతాయి. కానీ, ప్రతి సంవత్సరం ఆగస్టు మాసంలో చాలా రొటీన్‌గా పసిబిడ్డలు చచ్చిపోతుంటారు. వారికి ఆక్సిజన్ అవసరమవుతూ ఉంటుంది. ఆక్సిజన్ సప్లైదారులతో కుమ్మక్కై ఆక్సిజన్ ప్లాంటేషన్స్‌ను వ్యాపార స్థాయికి దిగజార్చి, ప్రాణాలు పోయడానికి బదులు, పసిబిడ్డల ప్రాణాల్ని ఫణంగా ఎందుకు పెట్టారో తెలియాలంటే ఈ పుస్తకం చదివి తీరాలి.

డాక్టర్ కఫీల్ ఖాన్ ఈ వికృత చదరంగంలో ఒక పావుగా ఎందుకు శిక్ష అనుభవించాల్సి వచ్చిందో తెలుసుకుంటే అసలు సిసలైన ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయాన్యాయాల తాలూకూ డొల్లతనం తేటతెల్లమవుతుంది. ఒక వ్యక్తి ఒక వ్యవస్థను ఢీకొనటం అనేది సామాన్యమైన విషయం కాదు. వ్యవస్థకు ఎదురు నిలబడితే సహించే పరిస్థితి ఉండదు. దీనికి మతం రంగు తోడైతే అదెంత ఘోరంగా ఉంటుందో డాక్టర్ కఫీల్ ఖాన్ పుస్తకం చూపిస్తుంది.

డాక్టర్ కఫీల్ ఖాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తారు. ఆగస్టు 10 అర్ధరాత్రి రోజు ఆయన ఒక ఫోన్ రిసీవ్ చేసుకుంటారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా అయిపోయిందని. పిల్లల వార్డులో అప్పటికే ఆక్సిజన్ మీద వైద్యం జరుగుతున్న వారు చాలామంది ఉన్నారు. ఒక్కసారిగా గుండె గుభిల్లుమంటుంది. వెంటనే ఆసుపత్రికి వెళ్లి ఏం చేయాలో తోచక పై అధికారులకు ఫోన్ చేస్తే, ఎవరూ సరిగ్గా సమాధానం ఇవ్వక జూనియర్ డాక్టర్లతో, ఇతర సిబ్బంది సాయంతో 500 సిలిండర్లను పోగుచేసి బిడ్డల ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తారు. అయినా కూడా ఆరోజు 60 మంది పిల్లలు ప్రాణాలు కోల్పోతారు.

అసలెందుకీ కొరత ఏర్పడింది? అలక్ష్యం ఎక్కడ జరిగింది? పసిబిడ్డల ప్రాణాలను ఫణంగా పెట్టాల్సిన విషాదం వెనుక సందర్భాలేమిటి? దీని వెనుకున్న కుట్ర కోణం ఏమిటి, ఈ ఆక్సిజన్ ప్లాంట్ టెండర్లు దక్కించుకోవడంలో రాజకీయ శక్తుల ప్రమేయాలేమిటో ఈ పుస్తకం నగ్నంగా చూపుతుంది. అలక్ష్యాన్ని ప్రశ్నించారన్న కారణంగా డాక్టర్ కఫీల్ ఖాన్‌ను టార్గెట్ చేయడమూ, వారి కుటుంబాన్ని వేధించడమూ, వారి ఆస్తులను ధ్వంసం చేయడమూ, వారి వ్యాపారాలని నాశనం చేయడమూ, కుటుంబ సభ్యుల్లో ఒకరిపై కాల్పులు జరపడమూ, ఆసుపత్రికి తీసుకు వెళ్లేటప్పుడు వెంటాడటమూ, జైల్లో సాధారణ ఖైదీగా ఘోరమైన జీవితాన్ని చవి చూపించడమూ, నెలల తరబడి జైల్లో మగ్గేలా చేయడమూ లాంటి హృదయం చలించిపోయే అనేక ఉదంతాల గురించి చెప్పి కంటతడి పెట్టిస్తుందీ పుస్తకం.

ఇది పసిబిడ్డల్ని కోల్పోయిన తల్లిదండ్రుల విషాదమే కాదు, కఫీల్ ఖాన్ స్వయంగానూ, తన కుటుంబం ఎదుర్కొన్న ఒక అమానుషమైన, నిరంతర చిత్రవధకూ కూడా ప్రత్యక్ష సాక్ష్యం. ఈ పుస్తకం చదివినంత సేపూ గుండెలు పిండే వేదన. అనేకసార్లు కళ్ళు చెమ్మగిల్లుతాయి. అలక్ష్యం పట్ల ఆగ్రహావేశాలు కలుగుతాయి.

ఉద్యోగం కోల్పోయినా, కుటుంబ సభ్యుల ఆర్థిక మూలాల్ని విధ్వంసం చేస్తున్నా, నిరంతరం వెంటాడుతూ, వేధిస్తున్నా, వాళ్ల ప్రాణభయంతో విలవిలలాడిపోతున్నా ఏమీ చేయలేని తన అశక్తతని గుండెల్లో దిగమింగుకొని, ఎన్ని ఆటుపోటులెదురైనా ధైర్యంగా ఒకవైపు న్యాయపోరాటం చేస్తూనే, ప్రజా మద్దతును కూడగట్టుకుంటూనే, అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే, డాక్టర్ కఫీల్ ఖాన్ మానవీయ కోణంతో దేశవ్యాప్తంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ రావడం అత్యంత శ్లాఘనీయం. పోతే పోనీ, హితుల్ సుతుల్, వస్తే రానీ కష్టాల్ నష్టాల్ అనుకుంటూ ముందుకెళ్ళిపోతున్న డాక్టర్ కఫీల్ ఖాన్ ధైర్యాన్నీ, వారి న్యాయ పోరాటాన్నీ ఈ పుస్తకం చదివిన తర్వాత అభినందించకుండా ఉండలేరు.

– వి.విజయ్‌కుమార్

మేడే సందర్భంగా రచనల పోటీ!

సహోదరత్వం, సమానత్వం, సామాజిక న్యాయం, శాంతి, సంపదలతో తులతూగాల్సిన మన దేశం ఇవాళ ఏ పరిస్థితులలో ఉందో ప్రత్యేకంగా వివరించాల్సిన పని లేదు. డెబ్బై ఐదేళ్ల సామాజిక పరిణామక్రమం రాజ్యాంగ ఆశయాలను సాధించడంలో ఎంత వెనుకబడిందో మన కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. జాతి, మత, కుల, ప్రాంతీయ విద్వేషాలు మరింత పెచ్చరిల్లిపోయాయి. దేశ సంపద, సహజ వనరులు గుప్పెడు మంది చేతుల్లో పోగుపడిపోతుంది. శరీర కష్టం చేసే కార్మికులు, రైతులు. కష్టజీవుల ఇక్కట్లు పెరిగిపోతా ఉన్నాయి. విద్యా, వైద్య సౌకర్యాలు, పౌష్టికాహార లభ్యత ప్రియమైపోయాయి. అత్యధిక ప్రజానీకం హుందా అయిన గౌరవప్రదమైన జీవితాలకు ఇంకా దూరంగానే ఉన్నారు. శ్రమయేవ జయతే' అన్న అధికారిక నినాదం సిగ్గుతో చిమిడిపోతుంది. శ్రమను గౌరవించి, తగు రీతిన ప్రతిఫలం అందించే విధానాల ఊసే లేకుండా పోతుంది.

అందుకే రానున్న అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని (మేడే) పురస్కరించుకుని **ఇప్పుడు దేశం యావత్తును ఆవరించిన సామాజిక సంక్షోభాన్ని, దోపిడీ, వివక్షలను ప్రతిఫలించే కథలు, కవితలు, పాటలు, వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. ప్రతి విభాగంలోను మేలైన రచనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు రెండు ప్రోత్సాహక బహుమతులు (రూ. 5000, 3000, 2000; 1000) అందచేయ సంకల్పించాం.**

కవితలు, పాటలు ఎ4 సైజులో రెండు పేజీలకు మించరాదు. కథ, వ్యాసం ఏ4 సైజులో 8–10 పేజీలకు మించరాదు. మీ రచనలు కింద సూచించిన మెయిల్ కు పంపగలరు.

sramikasambaralu24@gmail.com

రచనలు స్వీకరించడానికి ఆఖరు తేదీ : 20.04.2024

బహుమతి పొందిన రచనలతో పాటు మేలైన రచనలు పుస్తకరూపంలో ప్రచురించబడతాయి. బహుమతి ప్రదానం, విజయవాడ నగరంలో 2024 మే 5వ తేదీన జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలలో రచయితలకు ఇదే సాదర ఆహ్వానం.

– జాషువా సాంస్కృతిక వేదిక, విజయవాడ

కవితావేదిక కవితల పోటీ-2024

కెనడాకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డా.నెల్లుట్ల నవీన్ చంద్ర ఆధ్వర్యంలో నడుస్తున్న కవితావేదిక సాహితీసంస్థ 2024వ సంవత్సరానికి జాతీయ స్థాయి వచన కవితల పోటీ నిర్వహిస్తోంది. ప్రథమ బహుమతి : రు.4,000, ద్వితీయ బహుమతి : రు.2,000, తృతీయ బహుమతి : రు.1,000. కవితా వస్తువు కవి ఐచ్ఛికం. కవిత పరిధి గరిష్టంగా 25 పంక్తులు ఉండాలి. కవిత వర్తమాన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండాలి. యూనికోడ్ ఫార్మాట్‌లో మాత్రమే పంపాలి. గడువు తేదీ : ఏప్రిల్ 30, 2024. కవితలు nakshatra1364@gmail.com కు పంపాలి.

శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు - 2023

5వ శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు– 2023 కోసం 2022, 2023లో ప్రచురితమైన కథా సంపుటాలను, బాలల కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. ఎంపికైన ఉత్తమ కథా సంపుటానికి రూ.7 వేల నగదు, ఎంపికైన బాలల కథా సంపుటానికి రూ.3000తో పాటు పురస్కార ప్రదానం జరుగుతుంది. మీ సంపుటాలు మూడేసి ప్రతులు ఏప్రిల్ 20, 2024 లోపు అందేలా పంపగలరు. **చిరునామా : కెవి మేఘనాథరెడ్డి, ఇంటి నెం. 11/21/01, ఎన్‌జిఓ కాలనీ, పుత్తూరు – 517583. ఆంధ్రప్రదేశ్.**

- మేఘనాధరెడ్డి, 63003 18230.

రాజాం రచయితల వేదిక 110వ సమావేశం

మార్చి 31వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 110వ సమావేశం జరుగుతుంది. రాజాపు శాంతారావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'వేమన ప్రగతి శీలత' అనే అంశంపై బొంతు సూర్యనారాయణ (ప్రవాహి) ప్రసంగిస్తారు.

- గార రంగనాథం,
98857 58123

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి – 522501, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా.

prajasavvadi@gmail.com



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఏచూరి

మెరుగైన దేశ నిర్మాణ సంకల్పాన్ని బలోపేతం చేయాలి : ఏచూరి

- భగత్ సింగ్‌కు సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మెరుగైన భారతదేశ నిర్మాణ సంకల్పాన్ని బలోపేతం చేయాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా సిపిఎం ఘనంగా నివాళి అర్పించింది. ఈ మేరకు సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకె గోపాలన్ భవన్)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఏచూరి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్య లక్షణాన్ని కాపాడుకునేందుకు, దేశ ప్రజలందరూ సమానమైన, దోపిడీ రహిత సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి భగత్ సింగ్ ఊహించిన విధంగా మెరుగైన భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, తపన్ సేన్, నిలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశం చూసిన అతిపెద్ద కుంభకోణం

- ఎన్నికల బాండ్లపై కేరళ సిఎం విమర్శ



కన్నూర్: ఎన్నికల బాండ్లు దేశం చూసిన అతిపెద్ద కుంభకోణమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. కన్నూర్‌లో సిఎఎకు వ్యతిరేకంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో సిపిఎం పిటిషన్ వేసిందని, దీంతోనే సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా ఆ సమాచారాన్ని దాచిపెట్టేందుకు కేంద్రం చాలా ప్రయత్నాలు చేసిందని, ఇందులో భాగంగానే దేశం దృష్టిని మరల్చిందేకు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని అన్నారు. 'మన దేశం ఎటు పోతోంది. ఒక ముఖ్యమంత్రి ఇప్పుడు నిర్బంధంలో ఉన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏమైనా చేస్తామనే వైఖరిలో ఉంది' అని విమర్శించారు.

ముర్షిదాబాద్ నుంచి మహ్మద్ సలీం పోటీ

- మరో నాలుగు స్థానాలకు సిపిఎం అభ్యర్థుల ప్రకటన

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో పోటీ చేయనున్న మరో నాలుగు లోక్‌సభ స్థానాలకు సిపిఎం తన అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ముర్షిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మహ్మద్ సలీం, బర్ద్వాన్ – దుర్గాపుర్ నుంచి సుకృతి ఘోషాల్, రాణాఘాట్ నుంచి అలకేశ్ దాస్, బోల్‌పూర్ నుంచి శ్యామిలి ప్రధాన్ పోటీ చేయనున్నట్లు సిపిఎం పేర్కొంది. వీరందరినీ లెఫ్ట్‌ఫ్రంట్ నామినేట్ చేసినట్లు తెలిపింది. దీంతో ఇప్పటి వరకు బెంగాల్‌లో 17 స్థానాలకు, దేశవ్యాప్తంగా 43 స్థానాలకు సిపిఎం అభ్యర్థులను ప్రకటించినట్లైంది. బెంగాల్‌లో సార్వత్రిక ఎన్నికల్లో లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించి, ప్రజా కేంద్రీకృత అజెండాకు మద్దతు తెలియజేయాలని విన్నవించింది. ప్రజా వ్యతిరేక విధానాలతో, నిరంకుశ చర్యలకు పాల్పడుతున్న తృణమూల్ కాంగ్రెస్ – బిజెపి దుష్ట ద్వయాన్ని ఓడించాలని పిలుపునిచ్చింది.

లడఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి

- కార్గిల్‌లో నిరాహార దీక్షలు

కార్గిల్ : కేంద్ర ప్రభుత్వ తీరుపై కార్గిల్‌లో ప్రజానీకం నిరసన గళమెత్తారు. లఢఖ్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలని డిమాండ్ చేస్తూ కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కెడిఎ) ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ నిరాహార దీక్షలు ప్రారంభయ్యాయి. మూడు రోజుల పాటు ఈ దీక్షలు కొనసాగుతాయని కెడిఎ నేతలు తెలిపారు. దీక్షలకు మద్దతుగా వివిధ సామాజిక తరగతులకు చెందిన ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మరోవైపు సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో లేహ్‌కు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో చర్చలు జరిగినా..అవి ఏ కోశాన ముందుకు సాగడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష ధోరణిని వ్యతిరేకిస్తూ నిరాహారదీక్ష చేపట్టారు. అమిత్ షాతో జరిగిన చర్చల్లో కెడిఎ నుంచి కూడా ప్రతినిధులు హాజరయ్యారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఒక రాజసభ స్థానం ఇవ్వాలని కూడా వీరంతా డిమాండ్ చేస్తున్నారు. జమ్ముకాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేసి రెండు ముక్కలుగా విడగొట్టిన తర్వాత లడఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

దర్యాప్తు సంస్థల దుర్వినియోగాన్ని అడ్డుకోండి

- ఇసిని కోరిన 'ఇండియా' ఫోరం
- బెదిరింపులు, వేధింపులతో స్వేచ్ఛాయుత ఎన్నికలు అసాధ్యం
- ప్రతిపక్షాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే కేజ్రీవాల్ అరెస్ట్



న్యూఢిల్లీ : ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారని ప్రతిపక్ష 'ఇండియా' ఫోరం ఆరోపించింది. ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, కాంగ్రెస్ ఎంపీలు కెసి వేణుగోపాల్, అభిషేక్ సింఘ్వి, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు డెరెక్ ఓ బ్రెయిన్, నదిముల్ హక్, ఆప్ ఎంపీ సందీప్ పాఠక్, డిఎంకె నేత పి విల్సన్ తదితరులు ఎన్నికల కమిషన్‌తో సమావేశమై ఈ మేరకు ఓ మెమొరాండం అందజేశారు.

ఎన్నికల వేళ.. దాడులు, విచారణలు, అరెస్టులు జరిగినప్పుడు ముందుగా వాటిని ఎన్నికల కమిషన్ పరిశీలించాలని, ఆ తర్వాత అందుకు ఆమోదం తెలపాలని ఆ మెమొరాండంలో 'ఇండియా' ఫోరం నేతలు సూచించారు. ఇసి అనుమతి తీసుకున్న తర్వాతే చర్యలకు ఉపక్రమించాలని తెలిపారు. దీనికి సంబంధించి ఒక సర్క్యులర్ విడుదల చేయాలని కోరారు. ప్రతిపక్ష నేతలను వేధించడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడే అధికారులు, వ్యక్తులపై విచారణ ప్రారంభించడం సహా వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'బెదిరింపులు, వేధింపుల వాతావరణంలో స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదన్నది మా అభిప్రాయం. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయకుండా ఎన్నికల కమిషన్ తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి. అందరికీ సమానావకాశాలు కల్పించకపోతే ఎన్నికల ప్రక్రియ తన పవిత్రతను కోల్పోతుంది' అని మెమొరాండంలో తెలిపారు. ఒక సిట్టింగ్ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడం రాజకీయ పార్టీలు, ప్రతిపక్షాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుందని 'ఇండియా' ఫోరం నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తన ఎన్నికల లక్ష్యాలను నెరవేర్చుకునే క్రమంలో ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలని అధికార పక్షం భావిస్తోందని, దానిలో భాగంగానే ఈ సంకేతాన్ని పంపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. అయినప్పటికీ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. అందరికీ సమానావకాశాలు లభించని పక్షంలో ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుంది' అని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. పలు ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు ఇసి కలిశారని కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వి చెప్పారు. 'ఇది ఏ ఒక్క వ్యక్తికో లేదా పార్టీకో సంబంధించింది కాదు. ఇది రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి సంబంధించిన విషయం. ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. దానిని దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం చేయడాన్ని అనుమతించకూడదు. అది స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడంపై ప్రభావం చూపుతుంది. అందుకే జోక్యం చేసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరాం. 75 సంవత్సరాల స్వతంత్ర భారత చరిత్రలో ఓ ముఖ్యమంత్రి అరెస్ట్ కావడం ఇదే మొదటిసారి' అని ఆయన చెప్పారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడేందుకు పాలక పక్షం ప్రయత్నిస్తోందని స్పష్టమవుతోందని, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే ఇతర రాజకీయ పార్టీల అవకాశాలను దెబ్బతీయడమే దాని ఉద్దేశమని 'ఇండియా' ఫోరం పక్షాలు విమర్శించాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలు, ఐపిసి నిబంధనలు ఉల్లంఘనకు గురవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో ఒక దృశ్యం

హోలీ వేళ యుపిలో దుర్మార్గం

- ముస్లిం మహిళలపై రంగులతో దాడి
- నలుగురి అరెస్టు

లక్నో : ముస్లింల పట్ల విద్వేష జాఢ్యాన్ని పెంచిపోషిస్తున్న బిజెపి అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో హిందూత్వ ఆకతాయిలు రెచ్చిపోయారు. బిజ్నోర్‌లో హోలీ పేరుతో ముస్లిం మహిళలపై వేధింపులకు పాల్పడ్డారు. మహిళల్లో ఒకరు వృద్ధురాలు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తంకావడంతో పోలీసులు నలుగురు దుండగులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ముస్లిం యువకుడు ఒకరు భార్య, తల్లితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా..ఆ దారిలో హోలీ జరుపుకుంటున్న యువకులు వారిని అడ్డుకున్నారు. బైక్ మీద ఉండగానే బలవంతంగా రంగులు పులిమారు. బక్కెట్లతో నీళ్లు కుమ్మరించారు. మహిళల్లో ఒకరు వృద్ధురాలు అయినా కూడా దుండగులు రంగులు చల్లారు. బైక్ చుట్టిముట్టి 'జై శ్రీరామ్..' నినాదాలు చేయాలని పట్టుబట్టారు. ఈ ఘటనకు సంబంధించిన దుండగులను గుర్తించి, నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ధాంపూర్ పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు.

ఇద్దరు సిట్టింగ్‌లకు దక్కని చోటు : జెడియు జాబితా విడుదల

పాట్నా : బీహార్‌లో జెడియు పోటీ చేయనున్న 16 స్థానాలకు ఆ పార్టీ ఆదివారం నాడు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. పాట్నాలో జరిగిన కార్యక్రమంలో జెడి(యు) అధ్యక్షులు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఈ జాబితాను విడుదల చేశారు. ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు..కవితా సింగ్ (సివాన్), సునీల్ కుమార్ పింటు (సీతామర్హి)లకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. వారి స్థానంలో సీతామర్హి స్థానం నుంచి ప్రస్తుత శాసన మండలి చైర్మన్ దేవేశ్ చంద్ర ఠాకూర్‌ను, సివాన్‌లో విజయ లక్ష్మి కుష్వాహను బరిలో నిలిపారు. రాష్ట్రీయ లోక్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రామేష్ సింగ్ కుష్వాహ భార్య అయిన విజయ లక్ష్మి శనివారమే జెడియులో చేరగా..ఆదివారం ఆమెకు టికెట్ ఖరారు చేయడం గమనార్హం. కాగా, మిగిలిన 14 స్థానాలకు ప్రస్తుత సిటింగ్ ఎంపిలనే జెడియు తన అభ్యర్థులుగా ప్రకటించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో జెడియు మొత్తం 17 స్థానాల్లో పోటీ చేసింది. ఇటీవల ఎన్‌డిఎ పక్షాల మధ్య కుదిరిన సీట్ల సర్దుబాటులో జెడియుకు 16 స్థానాలు కేటాయించిన సంగతి తెలిసిందే.

యుపిలో మదర్సాల మూసివేతతో వీధినపడనున్న 10 వేల మంది ఉపాధ్యాయులు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ముస్లింలను లక్ష్యంగా చేసుకొని అనునిత్యం వివిధ రూపాల్లో అణిచివేత చర్యలకు పాల్పడుతోంది. ఈ క్రమంలోనే యుపి మదర్సా యాక్ట్, 2004 రద్దు చేసింది. దీని దరిమిలా రాష్ట్రంలోని మదర్సా పాఠశాలలు మూతపడనున్నాయి. వీటిలో బోధించే వేలాది మంది ఉపాధ్యాయులు ఇప్పుడు వీధినపడనున్నారు. అభ్యసించే లక్షలాది మంది విద్యార్థుల భవిత అగమ్యగోచరంగా మారింది. దాదాపు 10 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, 26 లక్షల మందికి పైగా విద్యార్థులు మదర్సా చట్టం రద్దు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చట్టం రద్దుతో ప్రభావితమైన టీచర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. యుపి మదర్సా చట్టం రాజ్యాంగ విరుద్ధమనీ, ఇది లౌకికవాద సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నదని అలహాబాద్ హైకోర్టు ఇటీవల కొట్టివేసిన విషయం విదితమే. కాగా, హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయనున్నట్టు మదర్సా అసోసియేషన్ వెల్లడించింది. యుపిలో మొత్తం 16,513 గుర్తింపు పొందిన మదర్సాలు ఉన్నాయి. వీటిలో 560 మదర్సాలు ప్రభుత్వ సాయంతో నడవనున్నాయి. అలాగే, 8400కు పైగా గుర్తింపు లేని మదర్సాలు ఉన్నాయి. హైకోర్టు నిర్ణయం 26 లక్షల మందికి పైగా విద్యార్థులపై ప్రభావం చూపనున్నదని ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ చైర్మెన్ ఇఫ్తిఖార్ అహ్మద్ జావెద్ ఆందోళన వ్యక్తం చేశారు.

గాజా 'పీడకల'కు ముగింపు పలకాలి

- ఐరాస చీఫ్ విజ్ఞప్తి



రఫా: ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ విధ్వంసానికి గురైన గాజా గుమ్మం వద్దకు వెళ్లి, రక్తపాతాన్ని ఆపాలని, భయానక క్షామం వైపు నెట్టబడుతున్న గాజాకు మానవతా సహాయాన్ని అందించేందుకు వీలుగా తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు. రఫా పట్టణం ఈజిప్షియన్ వైపు క్రాసింగ్ వద్ద ఆయన శనివారం మట్లాడుతూ రఫా పై భూతల దాడులకు ఇజ్రాయిల్ చేస్తున్న యత్నాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనీయులు ఎక్కువ మంది రఫాలో ఆశ్రయం పొందుతున్నారు. గుటెరస్, ఇతర ప్రపంచ నాయకుల విజ్ఞప్తిని బేఖాతరు చేస్తూ గాజాను నామరూపాల్లేకుండా చేయాలని ఇజ్రాయిల్ చూస్తున్నది. 'గాజాలోని పాలస్తీనియన్లు ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు అత్యంత దారుణమైన స్థితిని ఎదుర్కొంటున్నారని గుటెరెస్ పేర్కొన్నారు. "ఏదైనా తదుపరి దాడి పరిస్థితిని మరింత దిగజార్చుతుంది."దాదాపు ఆరు నెలలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న బాంబు దాడుల్లో 32 వేల మందికిపైగా మరణించారు. గాజ నేడు తీవ్ర మానవీయా సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని గుటెరస్ హెచ్చరించినప్పటికీ, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం దాడులతో ముందుకెళ్తామని హూంకరిస్తు న్నారు. .రఫాపై భూతల దాడులకు అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే గాజాలోని పెద్ద భూభాగం శిథిలావస్థకు చేరుకుంది "గాజాలో ఆకలితో ప్రజలు పెద్దయెత్తున చనిపోతున్నారని" ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యు ఎఫ్ ఓ) ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. కాల్పుల విరమణ ప్రకటించకపోతే మే నాటికి ఉత్తర గాజాలో తీవ్ర క్షామం నెలకొంటుందని అది హెచ్చరించింది. ఇజ్రాయెల్ దళాలు గాజాలోని అతిపెద్ద ఆసుపత్రి సముదాయం అల్–షిఫాలో, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆదివారం కూడా దాడులు చేశాయి. . 800 మందికి పైగా పాలస్తీనీయులను అదుపులోకి తీసుకున్నాయి. ఇజ్రాయిలీ దళాలు నిర్బంధించిన లేదా అరెస్టు చేసినవారిలో ఆరోగ్య కార్యకర్తలు కూడా ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) పేర్కొంది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ నెతన్యాహుతో చర్చించి వెళ్లిన తరువాత దక్షిణ నగరమైన రఫాలోకి ఇజ్రాయిల్ దళాలు దూసుకెళ్లడం ప్రారంభించాయి. దీనిని బట్టి అమెరికా అండతోనే ఇజ్రాయిల్ రఫాపై భూతల దాడులకు రంకెలు వేస్తోందని అర్థమవుతుంది. బ్లింకెన్ మాత్రం రఫాపై భూతల దాడులకు ప్రత్యామ్నాయ మార్గం ఏదైనా చూడాలని నెతన్యాహుకు తాను సూచించానని చెబుతున్నారు. రఫాపై భూతల దాడులే జరిగితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ప్రపంచ నేతలు హెచ్చరిస్తున్నారు.



ఓటు వేస్తున్న మహిళ

ప్రశాంతంగా సెనగల్ అధ్యక్ష ఎన్నికలు

- బరిలో 17 మంది అభ్యర్థులు

డాకర్ : పశ్చిమ ఆఫ్రికా దేశమైన సెనగల్‌లో ఆదివారం అధ్యక్ష ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 17 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థులు ఎక్కువగా ఉన్నందున ఫలితాల వెల్లడికి ఎక్కువ రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే రెండో రౌండ్ జరిగే అవకాశం ఉందని కూడా భావిస్తున్నారు. సెనగల్ అధ్యక్షునిగా ఎన్నికవ్వాలంటే కనీసం 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు రావాలి. ఈ ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షులు మాకీ సాల్ కూడా ప్రధానంగా పోటీలో ఉన్నారు. ఇప్పటికే మాకీ సాల్ రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేశారు. బిబివై కూటమి అభ్యర్థిగా మాజీ ప్రధాని, 62 ఏళ్ల అమడౌ బా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మాకీ సాల్‌కు గట్టి పోటీ 44 ఏళ్ల బస్సిరౌ డియోమాయే ఫాయే నుంచి ఎదురువుతుందని భావిస్తున్నారు. గతవారమే ఫాయే జైలు నుంచి విడుదలయ్యారు. తిరుగుబాటు ఆరోపణలతో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఫాయే నిర్బంధంలో ఉన్నారు. కాగా, ఈ ఎన్నికలతో దశాబ్దకాలం తరువాత తొలిసారిగా ఒక మహిళా పోటీ చేస్తున్నారు. ఎఆర్‌సి పార్టీ నుంచి 40 ఏళ్ల బాబాకర్ గ్వేమ్ బరిలో ఉన్నారు.

అధిక ధరలతో

చితికిపోతున్నదెవరు? లాభం ఎవరికి?



కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ సందర్భంగా ధరల పెరుగుదల వల్ల చితికిపోతున్నదెవరు? లాభపడుతున్నదెవరు? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. 2014 ఏప్రిల్- మే తర్వాత వినియోగదారుల ధరల సూచీ అంతకంతకూ పైకెగబాకుతోంది. ప్రస్తుతం ద్రవ్యోల్బణం రేటు 7.8 శాతానికి చేరింది. దీన్ని కొలవడానికి వినియోగదారుల ధరల సూచీ (దీనినే జీవన వ్యయ సూచిక. అని కూడా అంటారు) యే ప్రామాణికం.. జీవన వ్యయం పెరిగినప్పుడు దీని వల్ల మొట్ట మొదట దెబ్బతినిపోయేది పేదలు, సామాన్యులే.

రైతులకేం ప్రయోజనం?

ద్రవ్యోల్బణం సాధారణంగా ధాన్యాలు, కూరగాయలు , ఇతర ఆహార ఉత్పత్తుల ధరల పెరుగుదలలో ప్రతిబింబిస్తుంది. ఆహార ధరల సూచీ 17 నెలల గరిష్టానికి చేరుకుంది ధాన్యం ధరలు 21 నెలల గరిష్టానికి చేరుకున్నాయి. కూరగాయల ధరలూ పెరిగాయి.ఈ ఒక్క విషయాన్ని పరిశీలిస్తే చాలు ధరల పెంపు వల్ల ఎవరు ఎక్కువగా నష్టపోతున్నారో అర్థమవుతుంది.. పేదలు చేసే ఖర్చులో 60 శాతం ఆహారంపైనే ఉంటుంది.

ధనికుల ఖర్చులో ఆహారం 10-20 శాతం మాత్రమే. ఈ సాధారణ వాస్తవాన్ని ఆర్థిక శాఖ తలకిందులు చేసి చూపుతోంది. ధరల పెరుగుదల వల్ల రైతులకు ఎందుకు ప్రయోజనం కలగడం లేదు? దీనికి కారణం ఏడాదికేడాది కేంద్ర ప్రభుత్వం కొనుగోళ్లను తగ్గించేస్తున్నది. వ్యాపారులకు దోచిపెట్టాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పని చేస్తున్నది. దీంతో వ్యాపారులు రైతుల నుండి తక్కువ ధరకు ధాన్యాలు కొని ఎక్కువ ధరకు అమ్ముకోవడం లేదా ఎగుమతి చేయడమో చేస్తున్నారు..ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగా ప్రపంచంలో ఆహార ధాన్యాల ధరలు పెరుగుతున్నాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని భారతదేశం నుండి ఎగుమతులను పెంచడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.అదే సమయంలో పంట పండించిన రైతుకు మాత్రం రవ్వంత ప్రయోజనం కూడా ఉండడం లేదు. గతంలో మాదిరిగా నిల్వలను పటిష్టం చేసి, ఆ నిల్వ ఉంచిన ధాన్యాన్నే వ్యాపారులకు అందుబాటులో ఉంచితే రైతులకు మేలు జరిగేది. కానీ దానికి బదులుగా వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎగుమతి చేసుకోవడానికి అవకాశం ఇవ్వడం వల్ల ధరల పెరుగుదల వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది.

పెట్రో బాదుడు?

ధరల పెరుగుదల గురించి కేంద్ర ఆర్థిక మంత్రి చర్చకు ముఖం చాటేస్తున్నారు.. డీజిల్‌పై 9 రెట్లు, పెట్రోల్‌పై 3 రెట్లు పన్ను పెంచి 8 ఏళ్లలో 26 లక్షల కోట్ల రూపాయలు వసూలు చేసిన ఘనత మోడీ సర్కార్‌దే. ఈ మొత్తాన్ని భారతదేశంలోని కుటుంబాల సంఖ్యతో భాగిస్తే, మోడీ ప్రభుత్వం దేశంలో ఒక్కో కుటుంబం నుండి సగటున లక్ష రూపాయలను కొల్లగొట్టిందన్నమాట.

పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడానికే ఇదంతా వినియోగిస్తున్నట్టు అంకెల గారడీతో మభ్య పెట్టాలని ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటుంది. పెట్రో ధరల పెంపుదల వల్ల ధనవంతులు, పేదలు ఇరువురిపైనా ప్రభావం పడిందని, అయితే దీనివల్ల పేదలకే అంతిమంగా ఎక్కువ ప్రయోజనం దక్కిందని కేంద్ర ఆర్థిక మంత్రి విచిత్రమైన వాదన చేస్తున్నారు.

ధరల పెరుగుదల అంత పెద్ద సమస్య కాదా?

ప్రస్తుత ధరల పెరుగుదల అంత పెద్ద సమస్య కాదనే అంటున్నది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం. అదే మంటే గతంలో కూడా ధరల పెరుగుదల సమస్య ఉంది కదా అని సమర్థించుకోజూస్తున్నది. గతంలో ధరల పెరుగుదలకు అప్పటి ప్రభుత్వాలు భారీ మూల్యమే చెల్లించుకున్నాయి. ప్రస్తుత ధరల పెరుగుదల గతంలో కంటే ప్రజల జీవన ప్రమాణాలపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఎందుకంటే కోవిడ్ కాలంలో చితికిపోయిన ఆర్థిక పరిస్థితి నుంచి సామాన్యులు ఇంకా కోలుకోలేదు. ప్రతి ఒక్కరూ తాము చేసిన అప్పుల నుంచి ఇప్పటికీ పూర్తిగా బయటపడలేదు. నిరుద్యోగం నాలుగు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయికి చేరింది.

పనిదినాలు గణనీయంగా పడిపోయాయి. ఎందుకంటే కోవిడ్‌కి ముందు ప్రభుత్వం ప్రకటించిన నోట్ల రద్దు సామాన్యుడిపై పిడుగుపాటులా పరిణమించింది. నోట్ల రద్దు వల్ల ఎక్కువ మందికి జీవనోపాధిగా ఉన్న అసంఘటిత రంగం దారుణంగా దెబ్బతినిపోయింది. దీనికి తోడు చుక్కలనంటుతున్న ధరలతో వేగలేక సామాన్యుడి బతుకు ఛిద్రమైంది.

టోకు ధరల సూచీ పైపైకి

ఏప్రిల్‌లో టోకు ధరల సూచీ 15.8 శాతం పెరిగింది. 30 ఏళ్లలో ఇదే అత్యధిక ద్రవ్యోల్బణం. టోకు ధరల సూచీకి, వినియోగదారు ధర సూచీకి మధ్య తేడా ఏమిటి? వినియోగదారు ధరల సూచీలో పరిగణించబడేది సగటు వ్యక్తి ఉపయోగించే వస్తువుల రిటైల్ ధరలు, ఆహారం , దుస్తులు , ప్రయాణం, విద్య , ఆరోగ్యం వంటి సేవలు.టోకు దరల సూచీ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి చేయబడిన అన్ని వస్తువులను పరిగణనలోకి తీసుకుంటుంది. పేరుకు తగ్గట్టుగానే ద్రవ్యోల్బణం టోకు ధర ఆధారంగా లెక్కించబడుతుంది.

వినియోగదారుల ధరల సూచీ వినియోగంపై దష్టి సారిస్తుంది. టోకు ధరల సూచీ ఉత్పత్తిలో ఉపయోగించే ముడి పదార్థాలపై దష్టి పెడుతుంది. సహజంగానే ఈ రెండు ధరల సూచీలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. వినియోగదారుల ధరల సూచీ కన్నా టోకు ధరల సూచీ చాలా ఎక్కువగా ఉండడాన్ని నేడు మనం చూస్తున్నాం. భారతదేశంలో ఉత్పత్తి వ్యయం వేగంగా పెరుగుతోందని టోకు ధరల సూచి తెలియజేస్తోంది. ఉత్పత్తి ఖర్చుల పెరుగుదల వెంటనే ఉత్పత్తుల ధరలో ప్రతిబింబించకపోవచ్చు.మున్ముందు దీని ప్రభావం ఉంటుంది. ఇది ధరల పెరుగుదలకు మరింత ఆజ్యం పోస్తుందన్నమాట.

నొప్పి నుండి లాభం పొందుతున్నదెవరు?

ధరల పెరుగుదల వల్ల ధనికులేమీ బాధపడరు. వారికి ఇది. లాభం కూడా. మొత్తం భారం శ్రామిక ప్రజలపైనే. వారి ఆదాయంలో కొంత భాగాన్ని ధనికులకు అనుకూలంగా పునఃపంపిణీ చేస్తారు. దావోస్‌లో బిలియనీర్ల సమావేశానికి ముందు, ఆక్స్‌ఫామ్ 'నొప్పి నుండి లాభం పొందేవారు' అనే పేరుతో ఒక నివేదికను ప్రచురించింది. కోవిడ్ సమయంలో తర్వాత ప్రతి 30 గంటలకు ఒక బిలియనీర్ పుడుతున్నారని, అదే సమయంలో ప్రతి 30 గంటలకు, ఒక మిలియన్ సాధారణ ప్రజలు అత్యంత పేదరికంలోకి నెట్టబడుతున్నారని ఆ నివేదిక తెలిపింది. ఒక వైపు సంపద, ఇంకోవైపు పేదరికం ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు వంటివి. ఇది కోవిడ్‌కు ముందే నెలకొన్న ఆర్థిక మాంద్యం లోనూ, కోవిడ్ అనంతర అధిక ధరల కాలంలోనూ ధనవంతులు మరింత ధనవంతులు కావడం.. పేదలు మరింత పేదలు కావడాన్ని మనం చూస్తున్నాం.

(ఫీచర్స్ అండ్ పాలిటిక్స్)



మీ కోసం

పులిహోర కోసం అన్నం వండేటప్పుడు అందులో ఒక చెంచా నూనె వేస్తే పొడిపొడిగా ఉంటుంది.

జీవన సౌరభం

అపజయాలు తప్పటడుగులు కాదు.. భవిష్యత్తులో ఏం చేయాలో తెలిపే పాఠాలు.

మార్పు



నరేంద్ర బస్‌స్టాండ్‌లో తన మిత్రుడు కోసం ఎదురుచూస్తున్నాడు. బస్ స్టాండ్ అంతా గోల గోలగా ఉంది. అపరిశుభ్రత స్పష్టంగా కనిపిస్తోంది. కొంతమంది ఆకు నమిలి అక్కడే ఉమ్మటం, మరికొంతమంది అరటి తొక్కలు ఇష్టానుసారంగా వేయటం చూశాడు. అదంతా చూస్తున్న నరేంద్ర ఇక భరించలేకపోయాడు. అరటితొక్కలు, ఖాళీ సిగరెట్టు ప్యాకెట్లు ఇలా తనకి కనిపించిన చెత్తనంతటినీ ఏరి చెత్తబుట్టలో వేశాడు. ఈలోగా తన మిత్రుడు రావాల్సిన బస్ వస్తే అక్కడికి వెళ్ళాడు. బస్ దిగగానే మిత్రుడిని ఆలింగనం చేసుకున్నాడు. కుశల ప్రశ్నలు అయ్యాక ఇంటికి వెళుతూ 'నరేంద్ర మీ ఊరి బస్టాండ్ ఏంటి ఇంత అధ్వానంగా ఉంది?' అని మిత్రుడు ప్రశ్నించాడు.

'ఇక్కడ ఇంతే రా మనం ఎంత శుభ్రం చేసినా మాములే. ఇందాక నేనే స్వయంగా కింద పడేసిన చెత్తా, చెదారం అంతా చెత్త బుట్టలో వేశాను. చెత్త బుట్ట ఎదురుగా కనిపిస్తున్నా దాన్ని ఉపయోగించరు' అన్నాడు అసహనంగా. 'అలా అంటే ఎలారా! మనమే అవగాహన కల్పించాలి, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే ఎలాంటి హాని జరుగుతుందో వివరించాలి' అంటూ బస్టాండ్‌లోని విచారణ కౌంటరు దగ్గరకు వెళ్ళి మైకు తీసుకుని 'ప్రయాణికులారా ఈ బస్ స్టాండ్ మనది. దయచేసి అరటి తొక్కలు, చెత్త వేసి పాడు చేయకండి. చెత్త బుట్టలు ఉపయోగించండి. పరిశుభ్రత పాటించండి. పరిసరాలను అపరిశుభ్రంగా చేయకండి' అని గట్టిగా చెప్పాడు. అది విని కొంతమంది వ్యక్తులు తమ చుట్టూ ఉన్న చెత్త, చెదారం, అరటి తొక్కలు తీసి చెత్త బుట్టలో వేశారు. అది చూసిన మిత్రుడు, 'చూశావా నరేంద్ర, పరిసరాల పరిశుభ్రత మనం పాటించడమే కాక, ఇతరులకూ అవగాహన కల్పించినప్పుడే పర్యావరణం సంరక్షించినట్లు. అర్థమైందా' అని చెబుతూ ఒకరి భుజంపై మరొకరు చేయి వేసుకుని ఇంటికి వెళ్లారు.

- కనుమ ఎల్లారెడ్డి,
ఆస్టిన్, టెక్సస్ స్టేట్,
అమెరికా, 93915 23027.



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



కింతాడ లోకేష్,
4వ తరగతి, ఎంపిపిఎస్
గొంపవానిపాలెం,
కె కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వేసవిలో ఇమ్యూనిటీని పెంచుకోండిలా ...

వేసవిలో శరీరానికి రోగ నిరోధకశక్తి (ఇమ్యూనిటీ) తగ్గితే త్వరగా వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా చర్మంపై అలర్జీలు, దగ్గు, ఫ్లూ లాంటివి వస్తుంటాయి. అందువల్ల మిగతా సీజన్ల కంటే వేసవిలో ఇమ్యూనిటీ ఎక్కువ ఉండటం అవసరం. రోగ నిరోధకశక్తిని పెంచుకోవటం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

వేసవికాలంలో ఆరోగ్యంగా ఉండాలంటే సిట్రస్ ఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. నిమ్మ, నారింజ, బత్తాయి, ఉసిరి లాంటి పండ్ల సలాడ్స్, జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు. వీటిలో ఉండే విటమిన్-సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. క్యారెట్, గుమ్మడికాయ, బీట్‌రూట్‌లు తినటం ద్వారా విటమిన్-ఎ, ఫైబర్, పొటాషియం లభిస్తుంది. ప్రొటీన్ ఫుడ్ తీసుకోవటం ద్వారా కూడా ఇమ్యూనిటీ పెరుగుతుంది. పప్పులు, గుడ్లు, చేపలు, నట్స్ లాంటివి కూడా ఆహారంలో చేర్చుకోవాలి. శరీరం ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండటం అవసరం. అందుకే సమ్మర్‌లో దాహం వేయకపోయినా నీళ్లు, జ్యూస్‌లు, నిమ్మరసం లాంటివి తాగుతూ ఉండాలి. బాదం, పిస్తా, జీడిపప్పు వంటి నట్స్‌లో ఉండే ఫోలిక్ యాసిడ్, నియాసిన్, జింక్, సెలేనియమ్ వంటివి కూడా ఇమ్యూనిటీ పెంపునకు దోహదపడతాయి. ఈ కాలంలో పిల్లలు, గర్భిణులకు నట్స్ చాలా మంచివి. ఈ కాలంలో పుచ్చకాయ, కర్బూజా లాంటి సీజనల్ పండ్లు ఎక్కువగా తీసుకోవటం వల్ల మాంగనీస్, విటమిన్ ఎ, పొటాషియం లభిస్తాయి. ఇవి ఇమ్యూనిటీని పెంచటంతోపాటు రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. మసాలాలు, కారం, వేపుళ్లు ఎక్కువగా తింటే ఇమ్యూనిటీ దెబ్బతినే అవకాశం ఉంది. వాటితోపాటు సమ్మర్‌లో ఫ్రైడ్ ఫుడ్స్, బేక్డ్ ఫుడ్స్ కూడా వీలైనంతవరకూ తినకుండా ఉండటమే మేలు.





రక్షిత మంచినీటినే తాగాలి

వేసవిలో సైనస్ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. ఎండ తీవ్రత, వేడిగాలి కారణంగా గాలి ద్వారా సోకే బ్యాక్టీరియా మరింత వేగంగా వ్యాపిస్తుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ తినే ఆహారం, తాగే నీటి గురించి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. దానితోపాటుగా పీల్చే గాలిపై కూడా శ్రద్ధ పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. గాలిలో ఉండే దుమ్ము, ధూళి, కాలుష్యం వల్ల వచ్చే ఇన్ఫెక్షన్లు వేసవిలో కూడా వ్యాపిస్తాయి. ఎండ తీవ్రత, వేడిగాలి కారణంగా గాలి ద్వారా సోకే బ్యాక్టీరియా మరింత వేగంగా వ్యాపిస్తుంది. శరీరంలో ప్రతి కణానికీ అవసరమైన ఆక్సిజన్ పీల్చుకునే గాలి నుంచే లభిస్తుంది. ఇది ముందుగా ఊపిరితిత్తుల్లోకి... అక్కడి నుంచి రక్తంలోకి చేరుకుని హిమోగ్లోబిన్‌తో జతకట్టి అన్ని కణాలకు చేరుతుంది. గాలి ద్వారా వేగంగా ఇన్ఫెక్షన్లు వ్యాప్తి చెందుతాయి.

వాయు కాలుష్యం కూడా ఎక్కువే !

ఎండాకాలం ఆస్తమా సమస్య ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు. పైగా ఈ సీజన్‌లో పొడిగాలి ఎక్కువగా ఉంటుంది. వాయికాలుష్యం స్థాయి పెరిగే కారణంగా ఆస్తమా రోగులకు ఈ సీజన్ కాస్త ఇబ్బందికరంగా మారొచ్చు. అందువల్ల సాధ్యమైనంత వరకూ ఎండకు బయటకు వెళ్లకుండా ఉండటమే మంచిది. వాహనాల నుంచే వెలువడే రసాయనాలు, దుమ్ము, ధూళి వంటివి శ్వాస ద్వారా లోపలికి వెళ్లినప్పుడు పొడిదగ్గు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. పొల్యూషన్, డస్ట్ కారణంగా పలు రకాల ఎలర్జీలు కూడా వేధించొచ్చు. గాలి ప్రభావం వల్ల కళ్ల మంటలు, దురద, కంటి నుంచి నీరు రావటం వంటి సమస్యలు కూడా తలెత్తొచ్చు. వేడి గాలిలోని దుమ్ము, ధూళి కారణంగా కళ్లు లేదా ముక్కులో అలర్జీలు రావొచ్చు. కొంతమందిలో సైనసైటిస్ సమస్యకు దారితీస్తుంది. అందువల్ల వేసవి సీజన్‌లో వేడి గాలి బాగా తగలకుండా జాగ్రత్తపడటం మంచిది. మన శరీరానికి అవసరమైన దుమ్ము, ధూళి ద్వారా ఆక్సిజన్ సరిగా అందకపోతే అలసట, నిస్సత్తువ, చిరాకు వంటివి వేధిస్తాయి. కొందరిలో ఇది ఒత్తిడికి సైతం దారితీయొచ్చు. శ్వాస సామర్థ్యాన్ని పెంపొందించుకునేలా కార్డియో కార్డియో వ్యాయామాలు, ప్రాణాయామం వంటివి చేయటం మంచిది.




ఈ జాగ్రత్తలు పాటించండి

డస్ట్ ఎలర్జీలు వంటివి రాకూడదంటే బయటకు వెళ్లేటప్పుడు ముక్కుకు గుడ్డ కట్టుకోవటం తప్పనిసరి. ఇంకా ఈ కింది జాగ్రత్తలు పాటించాలి.

- కాలుష్యానికి దూరంగా ఉండాలి
- పొగతాగే అలవాటును మానుకోవాలి
- ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- రోజూ వాడే వస్తువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి
- దిండు కవర్లు, దుప్పట్లను వారానికి ఒకసారి వేడినీటిలో ఉతికి, ఎండలో ఆరబెట్టుకోవాలి.

ఒంటికి చలువ.. కీరదోస రసం

వేసవిలో ఒంటికి చలువ చేసే ఆహార పదార్థాలు తీసుకోవటం మంచిది. పాలకూర, దోస, కీరదోసకాయలో నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటానికి దోహదపడుతుంది. శరీరంలో తక్కువ నీటి స్థాయిలు ఉంటే మన ఆరోగ్యంతోపాటు చర్మాన్ని కూడా దెబ్బతీస్తాయి. దోసకాయ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచటంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. దోసకాయ జ్యూస్ ఇంట్లోనే తయారుచేసుకుని తాగొచ్చు. రుచి కోసం కొద్దిగా నిమ్మరసం కూడా కలిపి తాగొచ్చు. దోసకాయ రైతా కూడా రుచికరమైనదే. చాలా ఆరోగ్యకరమైంది. రైతా చేయటం కూడా చాలా ఈజీ. రైతాతిన్నా, తాగినా కడుపు చల్లగా ఉంటుంది. జీర్ణక్రియ వేగాన్ని కూడా మెరుగుపరుస్తుంది.



టాలీవుడ్ కథా నాయికల జోరు



టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్ల హవా కొనసాగుతోంది. వివిధ ప్రాజెక్టుల్లో బిజీగా గడుపుతున్నారు. కాజల్, రష్మిక మందన్న, సమంత, కీర్తి సురేష్, పూజా హెగ్డే, సాయి పల్లవి, అనుపమ పరమేశ్వరన్, రాశీఖన్నా, నిధి అగర్వాల్, కృతిశెట్టి, తాప్సీ తదితరులు ఒకటికి మించిన సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. కొత్త హీరోయిన్లు వస్తున్నా వీరి ప్రత్యేకత కొనసాగుతూనే ఉంది. వీరు దక్షిణాది సినిమాలపై కేంద్రీకరిస్తూనే బాలీవుడ్‌లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసుకోవటానికి మిగిలిన వారు తాపత్రయపడుతున్నారు.

వర్ధమాన నాయికలకు సైతం పలు అవకాశాలు రావటం ఆహ్వానించదగిన పరిణామంగా చలనచిత్ర పరిశీలకులు పేర్కొంటున్నారు. నటుడు రాజశేఖర్ కుమార్తె శివాని రాజశేఖర్ కోటబొమ్మాళి పిఎస్ సినిమా ద్వారా తెలుగుదనంతో అలరించారు. పాయల్ రాజ్‌పుత్ 'ఆర్‌ఎక్స్ 100'తో సూపర్ హిట్ అందుకున్నా ఆ తర్వాత వరుస పరాజయాలను చవిచూశారు. మళ్లీ 'మంగళవారం' సినిమాతో హిట్‌ను అందుకున్నారు. శ్రీదేవి కుమార్తె జాన్వీకపూర్ జూనియర్ ఎన్టీఆర్‌తో కలిసి 'దేవర'లో నటిస్తున్నారు. తాజాగా ఆర్‌సి16 సినిమాలో రామ్‌చరణ్ సరసన నటిస్తున్నారు.

గతంలో ఫ్లాప్ సినిమాల్లో నటించిన నాయికలకు అవకాశాలు ఉండేవి కావు. ఇప్పుడు ట్రెండ్ మారినట్లుగా కనిపిస్తోంది. భామల కెరీర్‌పై పరాజయాల ప్రభావం తక్కువగానే కనిపిస్తోంది. ఫ్లాపులున్నప్పటికీ కొందరు హీరోయిన్లను పిలిచి దర్శక నిర్మాతలు అవకాశాలు ఇస్తున్నారు. హీరోయిన్ శ్రుతిహాసన్ 'వీరసింహారెడ్డి', 'వాల్తేరు వీరయ్య', 'సలార్'లాంటి పెద్ద విజయాలను అందుకున్నారు. అడవి శేషు సినిమా 'డకాయిట్', హాలీవుడ్ చిత్రం 'ది ఐ'లో కూడా నటించారు. 'సలార్-2'లో కూడా ఆమె కీలకపాత్రలో నటిస్తున్నారు. 'వారసుడు', 'యానిమల్' చిత్రాలతో అలరించిన రష్మిక అల్లు అర్జున్‌తో కలిసి 'పుష్ప-2 ది రూల్'లో నటిస్తున్నారు. ఆమె ప్రధాన పాత్రలో 'రెయిన్‌బో', 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలు రాబోతున్నాయి. 'దసరా'తో విజయాన్ని అందుకున్న కీర్తి సురేష్ కూడా పలు సినిమాల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం 'రఘుతాత', 'రివాల్వర్ రీటా', 'కన్నివేడి' సినిమాల్లో నటిస్తున్నారు. సమంత టైటిల్ రోల్‌లో చేసిన 'శాకుంతలం' బాక్సాఫీసు వద్ద తీవ్రంగా నిరాశపర్చింది. అయితే విజయ్ దేవరకొండతో చేసిన 'ఖుషి ఖుషి..' కాస్త ఆదరణ పొందటంతో ఆమెలో జోష్ నింపిందనే చెప్పాలి. అనారోగ్యం సమస్యల నుంచి కోలుకున్న ఆమె కూడా వరుస సినిమా ప్రాజెక్టులపై నటించే అవకాశం ఉంది. 'సిటాడెల్' ఓటీటీ సిరీస్‌లో కూడా ఆమె నటించారు. 'భారతీయుడు-2', 'సత్యభామ' చిత్రాల్లో కాజల్ నటించారు. 'ఉమ' అనే హిందీ సినిమాలో నటిస్తున్నారు. గతేడాది 'మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రంతో ఆకట్టుకున్న అనుష్క, తాజాగా కొత్త సినిమాలపై దృష్టిపెట్టారు. 'భాగమతి'కి పార్ట్ 2 చేయటానికి సన్నాహాలు జరుగుతున్నట్లుగా సమాచారం. 'కథనార్ ది వైల్డ్ సోర్సెరర్' అనే మలయాళం సినిమాను అంగీకరించారు. గతేడాది వరుస సినిమాలతో బిజీగా ఉన్న శ్రీలీల ఈ ఏడాది కూడా అదే జోరు కొనసాగిస్తున్నారు. మహేష్‌బాబుతో గుంటూరు కారంతో సందడిచేశారు. పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్‌సింగ్‌లోనూ ఆమెనే హీరోయిన్. మీనాక్షి చౌదరి విజయ్‌తో గోట్ సినిమాలో నటిస్తున్నారు. వరుణ్‌తేజ్‌తో మట్కా, దుల్కర్ సల్మాన్‌తో 'లక్కీ భాస్కర్', విశ్వక్‌సేన్‌తో ఓ సినిమా చేయబోతున్నారు. పూజాహెగ్డే గతేడాది తక్కువ సినిమాలే చేశారు. గుంటూరు కారం సినిమాకు మొదట ఆమెనే ఎంపిక చేశారు. ఆమె తప్పుకోవటంతో మీనాక్షి చౌదరి ఛాన్స్ దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సాహిద్ కపూర్‌తో 'దేవా' చిత్రం చేస్తున్నారు. ఈ ఏడాది సెట్స్‌పైకి వెళ్లే అల్లు అర్జున్, త్రివిక్రమ్ సినిమాకు పూజానే హీరోయిన్‌గా తీసుకునే అవకాశం ఉందని సమాచారం. సీతారామం తర్వాత సినిమాల సంఖ్య కంటే పాత్రలపైనే మృణాల్‌ఠాకూర్ కేంద్రీకరించారు. గతేడాది 'హాయ్ నాన్న'తో విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం తమిళంలో రెండు ప్రాజెక్టులు అంగీకరించారు. గతేడాది లియో, 'పీఎస్ 2'తో సందడి చేసిన త్రిష స్పీడు పెంచారు. వశిష్ట దర్శకత్వం చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర', మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ నటిస్తున్న 'థగ్ లైఫ్'లో ఆమెనే హీరోయిన్. 'రామ్', 'ఐడెంటిటీ' అనే మలయాళ సినిమాల్లోనూ నటిస్తున్నారు. సాయిపల్లవి ప్రస్తుతం నాగచైతన్యతో కలిసి 'తండేల్'లో నటిస్తున్నారు. బాలీవుడ్‌లో రామాయణంలో సీత పాత్రలో కనిపించనుంది. సాయిపల్లవి, కృతిశెట్టి, రాశీఖన్నా తదితర కథానాయికల సినిమాలు బాక్సాఫీసు వద్ద పెద్దగా ప్రభావం చూపించలేకపోతున్నాయి. 'ఉప్పెన' విజయం తర్వాత కృతిశెట్టికి మళ్లీ ఆ స్థాయి విజయం దక్కలేదు. అయినా ఆమె తెలుగు, తమిళ సినిమాల్లో బిజీగానే ఉంటున్నారు.

సూపర్ సంజు!

- రాయల్స్ కెప్టెన్ అర్ధ సెంచరీ
- ఛేదనలో పూరన్ పోరాటం వృథా
- లక్నోపై రాజస్థాన్ గెలుపు
- రాజస్థాన్ 193/4, లక్నో 173/6

రాజస్థాన్ రాయల్స్ రాజసం చూపించింది. ఐపిఎల్ 17 సీజన్ తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌పై అలవోక విజయం సాధించింది. సంజు శాంసన్ (82 నాటౌట్) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. వరుసగా ఐదో సీజన్లో తొలి మ్యాచ్‌లోనే అర్ధ సెంచరీ సాధించి అరుదైన రికార్డును సాధించాడు. 194 పరుగుల ఛేదనలో నికోలస్ పూరన్ (64 నాటౌట్), కెఎల్ రాహుల్ (58) అర్ధ సెంచరీలో సరిపోలేదు. 20 పరుగుల తేడాతో లక్నో సూపర్‌జెయింట్స్‌పై రాజస్థాన్ రాయల్స్ గెలుపొందింది.



జైపూర్ : సంజు శాంసన్ (82 నాటౌట్, 52 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సులు) సూపర్ అనిపించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో వరుసగా ఐదో సీజన్‌లో తొలి మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించిన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. సొంతగడ్డపై లక్నో సూపర్‌జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన సంజు శాంసన్ రాజస్థాన్ రాయల్స్‌కు అలవోక విజయాన్ని కట్టబెట్టాడు. సంజు శాంసన్‌కు తోడు రియాన్ పరాగ్ (43, 29 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు), ధ్రువ్ జురెల్ (20 నాటౌట్, 12 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 193 పరుగులు చేసింది. ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ చతికిల పడింది. కెప్టెన్ కెఎల్ రాహుల్ (58, 44 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), నికోలస్ పూరన్ (64 నాటౌట్, 41 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) అర్ధ సెంచరీలు సాధించినా.. లక్నోను ఓటమి నుంచి గట్టెక్కించలేదు. సంజు శాంసన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ఇద్దరు మెరిసినా.. : లక్నో లక్ష్యం 194 పరుగులు. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఇది కష్టమేమీ కాదు. రాజస్థాన్ పేసర్లు ట్రెంట్ బౌల్ట్, బర్గర్‌లు పవర్‌ప్లేలో నిప్పులు చెరిగారు. క్వింటన్ డికాక్ (4), దేవదత్ పడిక్కల్ (0), ఆయుశ్ బదాని (1) విఫలమయ్యారు. 11/3తో లక్నో సూపర్‌జెయింట్స్ టాప్ ఆర్డర్ కకావికలైంది. ఈ దశలో ఇంపాక్ట్ ఆటగాడు దీపక్ హుడా (26)తో కలిసి కెఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఈ క్రమంలో లక్నో రన్‌రేట్ బాగా పడిపోయింది. హుడా అవుటయ్యే సమయానికి లక్నో 7.3 ఓవర్లలో 60/4తో నిలిచింది. ఓ ఎండ్‌లో కెప్టెన్ రాహుల్ నెమ్మదిగా ఆడినా.. నికోలస్ పూరన్ (64) దంచికొట్టాడు. నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో దండెత్తాడు. రాహుల్, పూరన్ క్రీజులో ఉండగా లక్నో 24 బంతుల్లో 49 పరుగులు చేయాల్సిన స్థితిలో నిలిచింది. కానీ ఇక్కడే రాయల్స్ బౌలర్లు మ్యాజిక్ చేశారు. రాహుల్ వికెట్‌తో పూరన్‌పై ఒత్తిడి రెట్టింపు అయ్యింది. మార్కస్ స్టోయినిస్ (3), కృనాల్ పాండ్య (3 నాటౌట్, 5 బంతుల్లో) నిరాశపరిచారు. దీంతో 20 ఓవర్లలో 6 వికెట్లకు లక్నో సూపర్‌జెయింట్స్ 173 పరుగులే చేసింది. 20 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించింది. రాయల్స్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ (2/35), బర్గర్ (1/30), అశ్విన్ (1/35), సందీప్ శర్మ (1/22) రాణించారు.

చెలరేగిన శాంసన్ : టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. జోశ్ బట్లర్ (11) రెండో ఓవర్లోనే అవుటయ్యాడు. యశస్వి జైస్వాల్ (24, 12 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలి ఇన్నింగ్స్‌తో విరుచుకుపడినా.. వికెట్ కాపాడుకోలేదు. కెప్టెన్ సంజు శాంసన్ (82 నాటౌట్) పవర్‌ప్లేలోనే క్రీజులోకి వచ్చినా ఆఖరు వరకు ఆడాడు. రియాన్ పరాగ్ (43) తోడుగా రాయల్స్‌కు భారీ స్కోరు అందించాడు. సంజు, పరాగ్‌లు మూడో వికెట్‌కు 59 బంతుల్లోనే 93 పరుగులు జత చేశారు. శాంసన్ రెండు ఫోర్లు, 4 సిక్సర్లతో 33 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు.

స్కోరు వివరాలు :

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) హార్దిక్ (బి) మోషిన్ ఖాన్ 24, జోశ్ బట్లర్ (సి) రాహుల్ (బి) నవీన్ హాక్ 11, సంజు శాంసన్ నాటౌట్ 82, రియాన్ పరాగ్ (సి) దీపక్ హుడా (బి) నవీన్ హాక్ 43, షిమ్రోన్ హెట్‌మయర్ (సి) రాహుల్ (బి) రవి బిష్ణోయ్ 5, ధ్రువ్ జురెల్ నాటౌట్ 20, ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (20 ఓవర్లలో 4 వికెట్లకు) 193.

వికెట్ల పతనం : 1-13, 2-49, 3-142, 4-150.

బౌలింగ్ : మోషిన్ ఖాన్ 4-0-45-1, నవీన్ ఉల్ హాక్ 4-0-41-2, కృనాల్ పాండ్య 4-0-19-0, రవి బిష్ణోయ్ 4-0-38-1, యశ్ ఠాకూర్ 3-0-43-0, ఆయుశ్ బదాని 1-0-6-0.

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్ : క్వింటన్ డికాక్ (బి) బర్గర్ (బి) బౌల్ట్ 4, కెఎల్ రాహుల్ (సి) జురెల్ (బి) సందీప్ శర్మ 58, దేవదత్ పడిక్కల్ (బి) బౌల్ట్ 0, బదాని (సి) బట్లర్ (బి) బర్గర్ 1, నికోలస్ పూరన్ నాటౌట్ 64, మార్కస్ స్టోయినిస్ (సి) జురెల్ (బి) అశ్విన్ 3, కృనాల్ పాండ్య నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు : 14, మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 173.

వికెట్ల పతనం : 1-4, 2-10, 3-11, 4-60, 5-145, 6-154.

బౌలింగ్ : ట్రెంట్ బౌల్ట్ 4-0-35-2, బర్గర్ 3-0-30-1, రవిచంద్రన్ అశ్విన్ 4-0-35-1, అవేశ్ ఖాన్ 3-0-21-0, యుజ్వేంద్ర చాహల్ 3-0-25-1, సందీప్ శర్మ 3-0-22-1.

బుమ్రా బూమ్‌బూమ్..

- జశ్‌ప్రీత్ 3 వికెట్ల ప్రదర్శన
  గుజరాత్ టైటాన్స్ 168/6

అహ్మదాబాద్ : ముంబయి ఇండియన్స్ పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా (3/14) బూమ్‌బూమ్ ప్రదర్శనతో చెలరేగాడు. నాలుగు ఓవర్లలో 14 పరుగులకే 3 వికెట్లు పడగొట్టిన బుమ్రా.. గుజరాత్ టైటాన్స్ భారీ స్కోరు చేయకుండా కట్టడి చేశాడు. బుమ్రాకు తోడుగా సఫారీ పేసర్ గెరాల్డ్ కోయేట్జి (2/27) సైతం మెరవటంతో టైటాన్స్ బ్యాటర్లు తడబడ్డారు. సాయి సుదర్శన్ (45, 39 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (31, 22 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ తెవాటియ (22, 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది.

రాణించిన సుదర్శన్ : టాస్ నెగ్గిన ముంబయి ఇండియన్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. గుజరాత్ టైటాన్స్‌కు ఛేదనలో ఉన్న రికార్డు దృష్ట్యా హార్దిక్ పాండ్య ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఓపెనర్లు వృద్ధిమాన్ సాహా (19), శుభ్‌మన్ గిల్ (31) శుభారంభం చేశారు. తొలి వికెట్‌కు 31 పరుగులు జోడించారు. సహా నాలుగు బౌండరీలతో మెరువగా.. గిల్ మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ఆకట్టుకున్నాడు. మంచి ఆరంభాలను ఓపెనర్లు సద్వినియోగం చేసుకోలేదు. సాహాను బుమ్రా, గిల్‌ను చావ్లా అవుట్ చేయటంతో.. సాయి సుదర్శన్ (45, 39 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (17) జతకట్టారు. నెమ్మదిగా ఆడినా.. ఈ జోడీ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టింది. క్రీజులో కుదురుకున్న సాయిసుదర్శన్, ప్రమాదకర హిట్టర్ డెవిడ్ మిల్లర్ (12)ను బుమ్రా సాగనంపటంతో టైటాన్స్ భారీ స్కోరు ఆశలు ఆవిరయ్యాయి. చివర్లో రాహుల్ తెవాటియ (22) విలువైన పరుగులు జోడించాడు. రషీద్ ఖాన్ (4 నాటౌట్), విజయ్ శంకర్ (6 నాటౌట్) ఆశించిన ముగింపు ఇవ్వలేదు. ముంబయి ఇండియన్స్ బౌలర్లలో హార్దిక్ పాండ్య, లూక్ వుడ్, శామ్స్ ములాని, నమన్ ధిర్‌లకు వికెట్లు దక్కలేదు. బుమ్రా, కోయేట్జి మెరువగా.. పియూష్ చావ్లా పరుగుల పొదుపు పాటించలేదు.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68